ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వెల రూ.5/ - పేజీలు : 8 గురువారం 26 జూన్ 2025 సంపుటి: 01, సంచిక : 49
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

### కరసేవకుడి నుంచి కార్యసాధకుడి దాకా...

**కరీంనగర్ :** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో రాజకీయంగా అనేక విజయాలు సాధించినప్పటికీ, సొంతిల్లు లేని నాయకుడిగా గుర్తింపు పొందారు.బండి సంజయ్.. తెలంగాణలో రాజకీయాలపై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరికీ తెలిసిన నేత. కరుడుగట్టిన హిందుత్వ వాది. హిందూ టైగర్‌గా కరీంనగర్ పట్టణ ప్రజలు, యువత పిలుచుకునే మాస్ లీడర్. సామాన్య కరసేవకుడిగా ప్రయాణం ప్రారంభించి.. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఎదిగి. కార్య సాధకుడిగా గుర్తింపు పొందాడు. 30 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో ఎట్టకేలకు సొంత ఇల్లు కొనుగోలు చేశాడు.

విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news



# అంతా.. మీ ఇష్టమేనా?

- ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ఎందుకు ఆపుతున్నారు..
- పాత ఫీజులతో ఇవ్వాలన్నా.. లెక్క చేయరెందుకు?
- ఉన్నత విద్యామండలితో పంచాయితీ ఏంటి.. వాళ్లూ.. మీరూ కూర్చొని మాట్లాడుకోండి
- విద్యాశాఖ, సాంకేతిక విద్య అధికారులపై సీఎం మండిపాటు
- ప్రభుత్వ బడులను అదనపు కలెక్టర్లు సందర్శించాలి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష

**సూర్య న్యూస్ హైదరాబాద్**

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు అధికారులే అడ్డు పడుతున్న తీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. అధికారుల సమన్వయలోపంతో ప్రభుత్వం ఇరకాటంలో పడుతోందని ఆయన అన్నట్టు సమాచారం. అసలు ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌ను ఎందుకు ఆపుతున్నారో చెప్పా లని అధికారులను నిలదీసినట్టు తెలిసింది. విద్యాశాఖ ఉన్నతాధికారులతో సీఎం బుధవారం సమీక్షించారు. ముఖ్యంగా సాంకేతిక విద్యామండలి, విద్యాశాఖ ముఖ్య అధికారుల పనితీరుపైనే సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సందర్భంగా అధికారుల మధ్య కొనసాగుతున్న కోల్డ్‌వార్‌పై సీఎం సీరియస్ అవ్వడంపై అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది. విశ్వసనీయంగా తెలిసిన ప్రకారం... సమావేశంవివరాలు ఇలా ఉన్నాయి. పాత ఫీజులతోనే కౌన్సెలింగ్ చేపట్టాలని గతంలో ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. దీనిని దృష్టిలో ఉంచుకునే ఉన్నత విద్యామం డలి త్వరలో కౌన్సెలింగ్ చేపడతామని వెల్లడించింది. ఈ నేపథ్యంలో సాంకేతిక, ఉన్నతవిద్య అధికారులు అడ్డుపడటం వివాదానికి కారణమైంది. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించినట్టు తెలిసింది. ఉన్నత విద్యామండలి నేతృత్వంలో ఇప్పటి - మిగతా2లో



## కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖైదు

- 1975లో ఎమర్జెన్సీ విధింపుపై ప్రధానమంత్రి మోదీ ధ్వజం
- 1975లో విధించిన ఆత్యయిక పరిస్థితి ఓ చీకటి అధ్యాయం
- రాజ్యాంగ స్ఫూర్తి ఉల్లంఘనకు గురైన తీరును భారతీయులెవరూ విస్మరించలేరు



## 'బనకచర్ల'ను చట్టపరంగా అడ్డుకుంటాం

- సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- ఈ ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణ ప్రయోజనాలకు కలిగే నష్టంపై బలమైన వాదనలు వినిపిస్తాం
- ఆ ప్రాజెక్టు ప్రీ-ఫీజిబిలిటీ నివేదికను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించొద్దని, తిరస్కరించాలని తేల్చి చెప్పాం.




# 'శుభా'రంభం

- అంతరిక్ష కేంద్రానికి బయలుదేరిన శుభాంశు శుక్లా
- నేటి సాయంత్రం 4.30కి అంతరిక్ష కేంద్రానికి చేరిక
- 90% అనుకూలంగా వాతావరణం
- 41 ఏళ్ల తర్వాత భారత్ ఘనత
- ఎంతో అద్భుత యాత్ర: శుక్లా
- కేంద్ర క్యాబినెట్ ప్రశంస
- రాష్ట్రపతి, ప్రధాని శుభాకాంక్షలు

## ఆ ఐదింటిలో... టాప్-10లో భారత్

- కీలక సాంకేతిక రంగాల పోటీలో ముందంజ
- ఏఐ, అంతరిక్ష విభాగాల్లో మెరుగైన స్థానం
- హార్వర్డ్ కెన్నడీ స్కూల్ నివేదికలో వెల్లడి






## లాసెట్‌లో 30,311 మంది ఉత్తీర్ణత

ఫలితాలు వెల్లడించిన ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

# డెడ్‌లైన్.. సెప్టెంబర్ 30

- ఆలోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- 'రిజర్వేషన్లు' తేల్చేందుకు 30 రోజుల గడువు
- ఆ తర్వాత ఎన్నికల ప్రక్రియ పూర్తికి 60 రోజుల సమయం



**సూర్య న్యూస్ హైదరాబాద్**

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు బుధవారం తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు కాపీ అందిన 30 రోజుల్లో రిజర్వేషన్లు ఖరారు చేయాలని సర్కారుకు స్పష్టం చేసింది. అప్పటి నుంచి 60 రోజుల్లో రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపింది. గత పంచాయతీల కాల పరిమితి ముగిసి 14 నెలలు దాటిందంటూ, అయితే ఇప్పుడు 'ఆలస్యం'పై మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని హైకోర్టు పేర్కొంది. పంచాయతీ ఎన్నికలు వెంటనే నిర్వహిం చాలని కోరుతూ నల్లగొండ జిల్లా మల్లేపల్లి సర్పంచ్ పార్వతి, కుర్మపల్లి సర్పంచ్ శ్రీనివాస్, జనగాం జిల్లా కాంచనపల్లి సర్పంచ్ విజయ, నిర్మల్ జిల్లా తల్వేడ సర్పంచ్ అనిల్‌కుమార్, కరీంనగర్ జిల్లా చంగర్ల సర్పంచ్ వేణుగోపాల్, నిజాయతీగూడెం సర్పంచ్ మురళీధర్ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ చేపట్టి ఆయా పక్షాల వాదనల అనంతరం గతంలో తీర్పు రిజర్వు చేసిన జస్టిస్ టి.మాధవీదేవి బుధవారం తీర్పు వెలువరిం చారు. 'గ్రామ పంచాయతీల - మిగతా2లో

# 9 రోజుల్లో రైతు భరోసా జమ.. ఇదే తొలిసారి

- డిప్యూటీ సీఎం భట్టి ప్రకటన
- రైతుబంధు పథకం కింద గత భారాస ప్రభుత్వ పాలనలో ఏనాడూ సక్రమంగా పంపిణీ చేయలేదు

**సూర్య న్యూస్ హైదరాబాద్**

రాష్ట్రంలో రైతుభరోసా పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లో రూ.8,744.13 కోట్లను రైతుల ఖాతాల్లో జమచేయడం ఇదే తొలిసారి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. రైతుబంధు పథకం కింద గత భారాస ప్రభుత్వ పాలనలో ఏనాడూ సక్రమంగా పంపిణీ చేయలేదని ఆయన ఆరోపించారు. ఈ పథకం కింద గత 10 సంవత్సరాలలో సీజన్ వారీగా విడుదలైన నిధుల వివరాలను బుధవారం భట్టి విడుదల చేశారు. 2023లో అసెంబ్లీ ఎన్నికల ముందు యాసంగి సీజన్‌లో రైతుబంధు పథకం కింద భారాస ప్రభుత్వం నిధులు జమ చేయలేదని ఆయన విమర్శించారు. 2020లో మిగులు బడ్జెట్ ఉన్నప్పటికీ రైతుబంధు నిధుల పంపిణీకి గరిష్ఠంగా 169 రోజులు అంటే సుమారు ఐదున్నర నెలల సమయం తీసుకున్నారని ఆయన వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేనాటికి లోటు బడ్జెట్ ఉన్నా రైతుభరోసా కింద - మిగతా2లో



# డెడ్‌లైన్.. సెప్టెంబర్ 30

-మొదటిపేజీ తరువాయి

పదవీకాలం 2024 జనవరి 31తో ముగిసింది. రాజ్యాంగం ప్రకారం పదవీకాలం ముగిసేలోపే ఎన్నికలపై ఎస్ఈసీ నిర్ణయం తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికలు నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలి. ఆ మేరకు పిటిషనర్ల వాదన ఆమోదయోగ్యం. పంచాయతీల పదవీకాలం ముగిసి 14 నెలల కంటే ఎక్కువ సమయమే గడిచింది. అయితే ఆలస్యం సమర్థనీయమా.. లేదా.. అనే అంశాల్లోకి ప్రస్తుతం వెళ్లదలుచుకోవడంలేదు. వార్డు సభ్యులు, సర్పంచుల సీట్ల రిజర్వేషన్లు సహా ఎన్నికల ప్రకియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడం సముచితమని కోర్టు భావిస్తోంది. అయితే ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఐదు దశల ప్రక్రియను పూర్తి చేసేందుకు కనీసం 20 రోజులు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. దీన్ని పరిగణనలోకి తీసుకుని సెప్టెంబర్ 30లోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశిస్తున్నాం..' అని న్యాయమూర్తి తెలిపారు.

**ఇరుపక్షాల వాదనలు ఇలా..**

అంతకుముందు ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. 'ఎన్నికల ప్రక్రియలో 5 దశలు ఉండగా, 3 దశలు ఇప్పటికే పూర్తయ్యాయి. మరో రెండు దశలను 20 రోజుల్లో పూర్తి చేస్తాం. పంచాయతీలకు ఎన్నికల నిర్వహణ విషయంలో ఎస్ఈసీకి సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అయితే బీసీ కులాల వారీగా రాజకీయ



వెనుకబాటుతనాన్ని గుర్తించే ప్రక్రియకు కొంత సమయం పట్టింది. ఇప్పుడు డేటా సిద్ధంగా ఉంది..' అని చెప్పారు. ఎస్ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ.. 'బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. రిజర్వేషన్లు తేలకుండా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సొంతంగా ఎన్నికల నిర్వహణపై మేం నిర్ణయం తీసుకోలేం. ఎన్నికల ప్రక్రియకు సర్కార్ అంగీకరించిన నాటి నుంచి మాకు రెండు నెలల సమయం అవసరం..' అని నివేదించారు. పిటిషనర్ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. 'ఐదేళ్ల వ్యవధి ముగిసేలోపు పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడం రాజ్యాంగ విరుద్ధం. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి ఎన్నికలు నిర్వహిస్తామని గత అక్టోబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు హామీ ఇచ్చింది. ఆ హామీని నిలబెట్టుకోలేదు. ఎస్ఈసీ మౌన ప్రేక్షకుడిలా వ్యవహరిస్తోంది..' అని విమర్శించారు.

# 'బనకచర్ల'ను చట్టపరంగా అడ్డుకుంటాం

హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి–బనకచర్ల ప్రాజెక్టును చట్టపరంగా అడ్డుకుంటామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. ఈ ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణ ప్రయోజనాలకు కలిగే నష్టంపై బలమైన వాదనలు వినిపిస్తామన్నారు. హైదరాబాద్‌లోని నీటిపారుదల శాఖ కేంద్ర కార్యాలయంలో ఉన్నతాధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ... "బనకచర్ల పథకంతో తెలంగాణకు ఏర్పడనున్న ముప్పుపై సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఈ నెల 19న కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు వివరంగా పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చాం. ఆ ప్రాజెక్టు ప్రీ-ఫీజిబిలిటీ నివేదికను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించొద్దని, తిరస్కరించాలని తేల్చి చెప్పాం. దాంతో నివేదికను ఆమోదించలేదని, త్వరలోనే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. పదేళ్ల భారాస పాలనలో పుట్టుకొచ్చిన గోదావరి–బనకచర్ల ప్రాజెక్టును ఏపీలో నిర్మిస్తే రాష్ట్ర ప్రయోజనాలకు కలిగే నష్టంపై ఈ నెల 30న మధ్యాహ్నం 3 గంటలకు ప్రజాభవన్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను ఏర్పాటు చేశాం" అని పేర్కొన్నారు. సొరంగాల నిర్మాణంలో అపార అనుభవమున్న ఇద్దరు ప్రముఖ సైనికాధికారులను రాష్ట్ర నీటిపారుదల శాఖలోకి తీసుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. భారత సైన్యంలో ఇంజినీర్–ఇన్–చీఫ్‌గా పనిచేసిన జనరల్ హర్పల్‌సింగ్‌ను నీటిపారుదల శాఖకు సలహాదారుడిగా ఉండాలని ఆహ్వానించాం. అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించిన టన్నెల్ టెక్నాలజీ నిపుణుడు పరీక్షిత్ మెహ్రా నీటిపారుదల శాఖలో చేరనున్నారు" అని వెల్లడించారు.



కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ అంజాద్ హుస్సేన్, ఓఅండ్ఎం ఈఎన్సీ శ్రీనివాస్, డిప్యూటీ ఈఎన్సీ శ్రీనివాస్, నల్గొండ ప్రాజెక్టుల సీఈ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**2008 బ్యాచ్ ఏఈఈల పదోన్నతులకు చర్యలు**

నీటిపారుదల శాఖలో 17 ఏళ్లుగా సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లు(ఏఈఈ)గా పనిచేస్తున్న వారికి నిబంధనల మేరకు పదోన్నతులు కల్పించే చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఆదేశించారు. హైదరాబాద్‌లోని జలసౌధలో మంత్రిని 2008 బ్యాచ్ ఏఈఈలు కలిసి తమకు సుదీర్ఘకాలంగా పదోన్నతులు లేకపోవడాన్ని వివరించారు. స్పందించిన ఆయన వెంటనే సంబంధిత ఇంజినీర్లకు తగిన పదోన్నతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను ఆదేశించారు. ఏఈఈలు ఈ సందర్భంగా శాఖలో 125 డీఈఈ పోస్టులు ఖాళీగానే ఉన్నాయని, వాటిలో తమను భర్తీ చేయాలని మంత్రిని కోరారు.

**కాళేశ్వరం బ్యారేజీలపై సమీక్ష**

కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై ఎన్‌డీఎస్ఏ ఇచ్చిన నివేదికలపై మంత్రి ఉత్తమ్ సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... "ఎన్‌డీఎస్ఏ సూచనలను వెంటనే అమలులోకి తేవాలి. పునరుద్ధరణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు ప్రతి వారం సమీక్ష సమావేశం నిర్వహిస్తా. కేంద్ర జలసంఘం సూచనలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలి. డిండి ప్రాజెక్టు భూసేకరణపై సంబంధిత జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించాలి. ఎస్ఎల్‌బీసీ పురోగతిపై అంతర్జాతీయ స్థాయి ఏజెన్సీలతో చర్చించి ప్రతిపాదనలను స్వీకరిస్తాం. ఖర్చుకు వెనకాడకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనులను చేపట్టాలి. నీటిపారుదల శాఖలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రధాన ప్రాజెక్టుల్లో పూడికతీతపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశాం. నాగార్జునసాగర్‌లో పూడికతీత పనులు వెంటనే ప్రారంభించాలి. ఈ విషయంపై ఏపీ ప్రభుత్వానికి సమాచారం అందించాలి. సీతారామ ప్రాజెక్టుకు ప్రస్తుతం కేటాయించిన నిధుల పరిమితులకు లోబడి అదనపు ప్యాకేజీలను రూపొందించేలా దృష్టి సారించాలి.

# పుణెకు సై.. హైదరాబాద్‌కు నై!

హైదరాబాద్

మహారాష్ట్రలోని పుణెలో మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన కేంద్ర మంత్రివర్గం... హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ ప్రతిపాదనలను మాత్రం విస్మరించింది. మహారాష్ట్ర సర్కారుతో కలిసి పుణె మెట్రో రెండో దశను చేపట్టేందుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. కానీ, హైదరాబాద్ మెట్రో రెండో దశ 'ఏ' భాగానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను కేంద్రానికి సమర్పించి 8 నెలలు కావొస్తున్నా స్పందన కరవైంది. ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు కోరింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రధాని మోదీని పలుమార్లు కలిసి విన్నవించారు. గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిని సీఎం ఇటీవల స్వయంగా కలిసి మెట్రో విస్తరణకు ఆమోదం తెలపాలని కోరారు. బుధవారం నాటి కేంద్ర మంత్రివర్గ సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైలు అంశమే చర్చకు రాకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది.

**ఐదు కారిడార్లతో ప్రతిపాదనలు..**

హైదరాబాద్ మెట్రో రెండో దశ మొదటి భాగంలో ఐదు కారిడార్లను ప్రతిపాదించారు. 76.4 కి.మీ.గాను రూ.24,269 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశారు. డీపీఆర్‌లను గతేడాది జులై 26న రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. నవంబరు 2న పరిపాలనాపరమైన అనుమతులు జారీ చేసింది. ఒక్కో కారిడార్ డీపీఆర్‌లతో పాటు హెచ్ఎండీఏ పరిధి వరకు సిద్ధం చేసిన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్(సీఎంపీ) ట్రాఫిక్ అధ్యయన నివేదిక, ప్రత్యామ్నాయ రవాణా ప్రణాళికలు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పరిపాలనా అనుమతులను జత చేసి... నవంబరు 4న కేంద్రానికి పంపారు. ప్రాజెక్టు పూర్తయితే 8 లక్షల మంది ప్రయాణికులకు అత్యాధునిక, కాలుష్యరహిత రవాణా సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ట్రాఫిక్ పెరుగుదల దృష్ట్యా మెట్రో విస్తరణ అత్యవసరమని చెప్పారు.



రాష్ట్ర ప్రతిపాదన పరిశీలనలో ఉందని కేంద్రం ఇటీవల తెలిపింది. పుణె రెండో దశ పూర్తయితే 2027 నాటికి నిత్యం 96 వేల మంది ప్రయాణిస్తారని అంచనా. ప్రయాణికుల సంఖ్య తక్కువే అయినా ఆ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన కేంద్రం... అందుకు 8 రెట్ల మంది ప్రయాణించే హైదరాబాద్ మెట్రో విస్తరణను విస్మరించడం సరికాదని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది.

**సంయుక్త ప్రాజెక్టుగా...**

మెట్రో 2(ఏ) ప్రాజెక్టు మొత్తం వ్యయంలో 30 శాతం అంటే రూ.7,313 కోట్లను తామే భరిస్తామని, కేంద్ర ప్రభుత్వం తన వాటా 18 శాతం కింద రూ.4,230 కోట్లు భరించాలని, మరో 48 శాతం రూ.11,693 కోట్లను జైకా(జపాన్ ఇంటర్‌నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ) వంటి సంస్థల నుంచి రుణాలు తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. మిగిలిన 4 శాతం పీపీపీ ద్వారా సమకూర్చుకునేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు. కాగా, మెట్రో 2(బి)లోని మూడు కారిడార్లలో 86.1 కి.మీ. ప్రతిపాదనలకు సంబంధించి డీపీఆర్‌లను రాష్ట్ర ప్రభుత్వం శనివారమే కేంద్రానికి సమర్పించింది.

# అంతా మీ ఇష్టమేనా..?

-మొదటిపేజీ తరువాయి

వరకూ అనేక ఉమ్మడి ప్రవేశ పరీక్షలను దిగ్విజయంగా నిర్వహించారని, ఎక్కడా ఎలాంటి సమస్యలు రాలేదని సీఎం సమావేశంలో కొనియాడారు. కేవలం ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ విషయంలోనే సమస్య ఎందుకు వస్తుందని అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా 'మండలి అధికారులు ఇష్టానుసారం చేస్తున్నారు'అంటూ విద్యాశాఖ అధికారులు అనడంపై సీఎం సీరియస్ అయినట్టు తెలిసింది. వ్యక్తిగత సమస్యలతో విద్యార్థులకు అసౌకర్యం కలిగించేలా చేయడం సరికాదని అన్నట్టు సమాచారం.

ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డితో తాను స్వయంగా మాట్లాడతానని, ఆయన సంస్కరణలపై పట్టుదలగా ఉన్నారని సీఎం అన్నట్టు తెలిసింది. సాంకేతిక విద్య అధికారుల ప్రమేయం లేకుండా కౌన్సెలింగ్ చేపడతామని ఉన్నత విద్యామండలి చెప్పడమే నేరంగా భావించడం సరికాదని సీఎం హితబోధ చేసినట్టు తెలిసింది. ఇంజనీరింగ్ ఫీజుల నిర్ధారణపై కమిటీ వేయాలనే ప్రభుత్వ ఆలోచన కూడా కౌన్సెలింగ్ జాప్యానికి కారణమన్న అధికారుల వాదనతో సీఎం ఏకీభవించలేదని తెలిసింది. అధికారులంతా ఒకసారి కూర్చొని వ్యక్తిగత అంశాలుంటే మాట్లాడుకోవాలని సూచించినట్టు తెలిసింది.


**బడిబాటపై అసంతృప్తి**

బడిబాటపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. ప్రభుత్వ బడుల్లో ఎక్కువ మందిని చేర్చడమే లక్ష్యంగా చేపట్టిన బడిబాట ఆశించిన పురోగతి సాధించలేదని ఆయన అన్నట్టు తెలిసింది. ఉన్నతాధికారులే ఈ కార్యక్రమాన్ని లైట్‌గా తీసుకున్నారని, ఇక క్షేత్రస్థాయిలో ఎందుకు స్పందన ఉంటుందని సీఎం అన్నట్టు సమాచారం.

ప్రభుత్వ బడులను అదనపు కలెక్టర్లు సందర్శించాలి : సీఎం

ప్రతీజిల్లా అదనపు కలెక్టర్ వారంలో రెండుసార్లు ప్రభుత్వ స్కూళ్లను సందర్శించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సమావేశ వివరాలపై బుధవారం ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ఏడాది ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ స్కూళ్లలో 48 వేల మంది చేరినట్టు సీఎం తెలిపారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కొత్త గదులను నిర్మించాలని అధికారులకు చెప్పారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు పాఠశాలల్లో వసతులు కల్పించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం తయారీకి సంబంధించి గ్యాస్, కట్టెల పొయ్యిల బాధల వంట చేసే మహిళలకు విముక్తి కల్పించాలని, సోలార్ కిచెన్ల ఏర్పాటుపై దృష్టి పెట్టాలన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులవుతున్న విద్యార్థుల సంఖ్యకు, ఇంటర్‌లో చేరుతున్న విద్యార్థుల సంఖ్యకు పొంతన ఉండటం లేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. వారంతా ఇంటర్‌లో చేరేలా చూడాలన్నారు. ఇంటర్ అనంతరం జీవనోపాధికి అవసరమైన స్కిల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని సీఎం అన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.హరిత తదితరులు పాల్గొన్నారు.

# లాసెట్‌లో 30,311 మంది ఉత్తీర్ణత




హైదరాబాద్

న్యాయవిద్య కోర్సుల్లో ప్రవేశానికి ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీ లాసెట్)లో 30,311 (66.46 శాతం) అర్హత సాధించారు. మూడేళ్లు, ఐదేళ్లు, పీజీ లాసెట్‌కు మొత్తం 57,715 మంది దరఖాస్తు చేయగా, 45,609 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 30,311 మంది అర్హత సాధించారు. లాసెట్ ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి బుధవారం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండలి వైస్‌చైర్మన్లు ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కే.మహమ్మూద్, మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్ తదితరులు పాల్గొన్నారు. అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 82.19 శాతం ఉత్తీర్ణత సాధించగా, నిజామాబాద్ 59.24 శాతంతో ఆఖరి స్థానంలో ఉందని బాలకిష్టారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో అన్ని కోర్సులకు కలిపి 31 కాలేజీలున్నాయని, ఇందులో 8,680 సీట్లు ఉన్నాయన్నారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే...

బోథ్: తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాను ఐదేళ్ల లా కోర్సులో టాప్ ర్యాంకు సాధించినట్టు ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రానికి చెందిన రుతిక తెలిపారు. లా చదవాలనే ఆకాంక్షతోనే సీరియస్‌గా ప్రిపేర్ అయ్యానని చెప్పారు.

సివిల్స్ టార్గెట్

సిద్దిపేటజోన్: మూడేళ్ల లా కోర్సులో మూడో ర్యాంకు సాధించిన సిద్దిపేటకు చెందిన మాడుగుల శిరీష్ శర్మ సివిల్స్ సాధించడమే తన టార్గెట్ అని చెప్పారు. బీటెక్ పూర్తిన చేసిన శిరీష్ ఉద్యోగ ప్రయత్నాల్లోనే భాగంగానే లాసెట్ రాశాడు. ఆయన తండ్రి సిద్దిపేట రూరల్ ఎంపీడీఓగా పనిచేస్తున్నారు.

# 9 రోజుల్లో రైతు భరోసా జమ.. ఇదే తొలిసారి


-మొదటిపేజీ తరువాయి

గత ప్రభుత్వంతో పోలిస్తే ఎకరాకు రూ.2,000 అదనంగా కలిపి ఏడాదికి రూ.12,000 ఇస్తోందన్నారు. ఈ వానాకాలం సీజన్‌లో కేవలం తొమ్మిది రోజుల్లో రూ.8,744.13 కోట్లను రైతుల ఖాతాల్లో జమచేయడం దేశ చరిత్రలోనే ఓ రికార్డు అని ఆయన పేర్కొన్నారు.

**కుటీర పరిశ్రమలను ప్రోత్సహిస్తాం**

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: కుటీర పరిశ్రమలకు తమ ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద మైదానంలో 'బీసీ కులవృత్తుల వస్తు ప్రదర్శన' ప్రారంభమైంది. మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌లతో కలిసి భట్టి విక్రమార్క ప్రదర్శన ప్రారంభించారు. 30 స్టాళ్లలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన ఈ నెల 29 వరకు జరగనుంది. స్టాళ్లను పరిశీలిస్తూ భట్టి విక్రమార్క కుమ్మరి స్టాల్‌లో కుండను తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ లాంటి నగరంలో యాంత్రిక జీవనానికి అలవాటు పడిన ప్రజలు బయటకు వచ్చి కుటీర పరిశ్రమల్లో తయారైన వస్తువులను కొనుగోలు చేసేందుకు ఇదో మంచి అవకాశమన్నారు. పొన్నం మాట్లాడుతూ ప్రతి ఆషాఢ మాసంలో బోనాల ఉత్సవాల్లో బోనం మొదలు ప్రతి వస్తువు కుల వృత్తుల నుంచే రూపొందుతుందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, ఆమిర్ అలీఖాన్, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బీసీ కమిషన్ సభ్యులు, కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఐదింటిలో... టాప్-10లో భారత్



కీలకమైన ఐదు ప్రధాన సాంకేతిక రంగాల్లో భారత్ టాప్%–%10లో చోటు సంపాదించింది. ఈ రంగాల్లో ప్రపంచంలోని 25 ప్రధాన దేశాల సామర్థ్యాలను తెలియజేస్తూ హార్వర్డ్ కెన్నడీ స్కూల్‌కు చెందిన బెల్ఫర్ సెంటర్ ఫర్ సైన్స్‌అండ్ ఇంటర్నేషనల్ అఫైర్స్ 'క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇండెక్స్' అనే సూచీని రూపొందించింది. ఏఐ, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్స్, అంతరిక్షం, క్వాంటమ్ టెక్నాలజీ విభాగాల్లో దేశాల తయారీ సామర్థ్యం, సాంకేతిక పురోగతి, ప్రభుత్వ నియంత్రణ, అంతర్జాతీయంగా స్థానం, మానవ వనరులు, ఆర్థిక వనరుల వంటి అంశాల ఆధారంగా దేశాలకు స్థానాలు కేటాయించారు.

**ఏఐలో దూసుకుపోతూ..**

కృత్రిమ మేధ విభాగంలో భారత్ దూసుకుపోతోందని చెప్పాలి. దేశంలో ఏఐ వినియోగం.. అమెరికా, యూకేలతో పోలిస్తే ఎక్కువగా ఉంది. ఇంటర్నెట్ వినియోగదారుల్లో 90% మంది ఏదో ఒక విధంగా ఏఐని వాడుతున్నారు. దేశంలో ఏఐ యూజర్ల సంఖ్య 72 కోట్లు దాటింది. 'క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇండెక్స్' ఏఐ విభాగంలో జపాన్ , తైవాన్ , దక్షిణ కొరియా కంటే మనం ముందున్నాం. బయో టెక్నాలజీ రంగంలో ప్రపంచంలో భారత్ అగ్రదేశాల సరసన చోటు దక్కించుకుంది. వ్యాక్సిన్ల ఉత్పత్తిలో మనమే ప్రపంచంలో నంబర్ వన్. ఈ సూచీలోని బయోటెక్నాలజీ విభాగంలో ఫ్రాన్స్, తైవాన్ , దక్షిణ కొరియాలను మనం అధిగమించాం

**సిలికాన్ వేఫర్ల ఉత్పత్తిలో..**

సెమీకండక్టర్ల తయారీలో వాడే సిలికాన్ వేఫర్ల ఉత్పత్తిలో ప్రపంచంలో మనం మూడో స్థానంలో ఉన్నాం. ప్రపంచ చిప్ వినియోగంలో 10 శాతం వాటా భారత్ కైవసం చేసుకుంది. చిప్ డిజైన్ సౌకర్యాలలో ప్రపంచంలో 7% మాత్రమే భారత్ కలిగి ఉన్నప్పటికీ.. ప్రపంచంలోని డిజైన్ ఇంజనీర్లలో దాదాపు 20% మంది భారత్‌లోనే ఉన్నారు. వీరిలో అత్యధికులు యూఎస్, యూరప్ సంస్థల కోసం పనిచేస్తున్నారు. ఈ సూచీలో సెమీకండక్టర్స్ విభాగంలో మనం ఫ్రాన్స్‌కంటే ముందున్నాం.

**5వ అతిపెద్ద సంస్థగా ఇస్రో**

అంతరిక్ష పరిశోధనలో ప్రపంచంలో 5వ అతిపెద్ద సంస్థగా ఇస్రో చోటు సంపాదించింది. ప్రపంచంలో మొదటి ప్రయత్నంలోనే ప్రతిష్టాత్మక 'మంగళ్‌యాన్' ప్రాజెక్టు ద్వారా అంగారకుడిపైకి అడుగుపెట్టిన దేశం భారత్. ఈ సూచీలో అంతరిక్ష విభాగంలో జపాన్ , దక్షిణ కొరియా, తైవాన్ కంటే మనదేశం ముందుంది. క్వాంటమ్ టెక్నాలజీకి సంబంధించి అత్యధిక పేటెంట్లకు దరఖాస్తు చేసిన దేశాల్లో మనదేశం 9వ స్థానంలో ఉంది. ఈ సూచీలో క్వాంటమ్ టెక్నాలజీలో తైవాన్, దక్షిణ కొరియాలను భారత్ మించిపోవడం గమనార్హం.

ఏయే అంశాల ఆధారంగా స్కోర్‌ను నిర్ణయించారంటే...

ఏఐ

టాప్ మోడల్స్ కచ్చితత్వం, డేటా, ఆల్గరిథమ్స్, కంప్యూటింగ్ పవర్, నియంత్రణ, అంతర్జాతీయంగా స్థానం, మానవ వనరులు, ఆర్థిక వనరులు.

**బయోటెక్నాలజీ**

జన్యు ఇంజనీరింగ్, ఔషధాల తయారీ, వ్యాక్సిన్ పరిశోధన, వ్యవసాయ సాంకేతికత, నియంత్రణ, అంతర్జాతీయంగా స్థానం, మానవ వనరులు, భద్రత, ఆర్థిక వనరులు.

**సెమీకండక్టర్స్**

అసెంబ్లింగ్, టెస్టింగ్, ఎక్విప్‌మెంట్, తయారీ–ఫ్యాబ్రికేషన్ , చిప్ డిజైన్ %–% టూల్స్, ప్రత్యేక ముడిపదార్థాలు%–%వేఫర్స్, నియంత్రణ, అంతర్జాతీయంగాస్థానం, మానవ వనరులు, ఆర్థిక వనరులు.

స్పేస్

రిమోట్ సెన్సింగ్, టెలికమ్యూనికేషన్ ్స, పొజిషనింగ్%–నావిగేషన్ %–%టైమింగ్, సైన్ ్స%–% అంతరిక్ష పరిశోధన, దేశీయంగా అంతరిక్ష ప్రయోగ సామర్థ్యం, నియంత్రణ, అంతర్జాతీయంగా స్థానం, మానవ వనరులు, ఆర్థిక వనరులు

**క్వాంటమ్**

క్వాంటమ్ కంప్యూటింగ్, కమ్యూనికేషన్స్ , సెన్సింగ్,ప్రభుత్వ విధానాలు, అంతర్జా తీయంగా స్థానం, మానవ వనరులు, భద్రత, ఆర్థిక వనరులు.

# 'శుభా'రంభం

దిల్లీ

భారత అంతరిక్ష చరిత్రలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతూ.. 140 కోట్ల మంది భారతీయుల ఆశలను మోస్తూ భారత వైమానిక దళ ఫైటర్ పైలట్ అయిన మన వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్షంలోకి దూసుకెళ్లారు. మరో ముగ్గురితో కలిసి భారత కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12.01 గంటలకు అమెరికాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి యాక్సియం–4 మిషన్‌లో భాగంగా స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్–9 రాకెట్‌ద్వారా డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) ఆయన పయనమయ్యారు. గురువారం సాయంత్రం 4.30 గంటలకు ఆయన ఐఎస్ఎస్‌కు చేరుకుంటారు. 14 రోజులపాటు అక్కడ గడుపుతారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ యాత్ర బుధవారం ప్రారంభమైంది. అయితే ప్రయోగానికి 60 సెకన్ల ముందు ఓ చిన్న లోపాన్ని ఇంజినీర్లు సరిచేయడంతో సజావుగా సాగింది. 41 ఏళ్ల తర్వాత భారతీయుడొకరు అంతరిక్షంలోకి వెళ్లడం ఇదే తొలిసారి. ఈ యాత్ర సమయంలో వాతావరణం 90 శాతం అనుకూలంగా ఉందని శాస్త్రవేత్తలు ప్రకటించారు. నాసా, యాక్సియం స్పేస్, స్పేస్‌ఎక్స్ ఇందులో పాలుపంచుకున్నాయి. అంతరిక్ష యాత్ర ఆరంభాన్ని మన దేశంలోని పలు ప్రాంతాలతోపాటు పోలండ్, హంగరీ, అమెరికాల్లో పలువురు వీక్షించారు. రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంపట్ల కేంద్ర క్యాబినెట్ హర్షం వ్యక్తం చేసింది. దేశం గర్వించదగిన క్షణమంటూ యాత్రను స్వాగతిస్తూ తీర్మానం చేసింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ.. శుభాంశుకు శుభాకాంక్షలు తెలిపారు. అంతరిక్ష యానంలో ఉన్న శు క్లా.. ఎంత అద్భుత యాత్ర అంటూ భూకక్ష్యలోకి వెళ్లాక సంతోషాన్ని పంచుకున్నారు.

**10 నిమిషాల్లో భూకక్ష్యలోకి..**

యాక్సియం–4 మిషన్‌లో భాగంగా ఫాల్కన్–9 రాకెట్‌ద్వారా శుభాంశు శుక్లా (భారత్), పెగ్గీ విట్సన్ (నాసా అంతరిక్ష మిషన్ మాజీ కమాండర్– అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ –విస్నీవ్‌స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ) అంతరిక్షంలోకి దూసుకెళ్లారు. ప్రపంచం మొత్తం ఆసక్తిగా చూస్తుండగా నింగిలోకి దూసుకెళ్లిన వారు.. 10 నిమిషాల తర్వాత 200 కిలోమీటర్ల ఎత్తులోని భూకక్ష్యలోకి ప్రవేశించారు. డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ 28 గంటలు ప్రయాణించి గురువారం సాయంత్రం 4.30 గంటలకు ఐఎస్ఎస్‌కు చేరుకుంటుంది. 41 ఏళ్ల కిందట 1984లో సోవియట్ రష్యాకు చెందిన సల్యూత్–7 స్పేస్ స్టేషన్ నుంచి రాకేశ్ శర్మ అంతరిక్షంలోకి వెళ్లి వచ్చారు. ఆ తర్వాత మళ్లీ శు భాంశు శుక్లాకు ఈ అవకాశం దక్కింది. కక్ష్యలోకి ప్రవేశించిన తర్వాత తమ సరికొత్త క్యాప్సూల్ పేరును 'గ్రేస్'గా వ్యోమగాములు వెల్లడించారు.



ఈ మిషన్‌ను పెగ్గీ విట్సన్.. కమాండ్ చేస్తారు. శు భాంశు శుక్లా.. పైలట్‌గా సేవలందిస్తారు. స్లావోస్జ్, టిబర్.. మిషన్ స్పెషలిస్టులుగా వ్యవహరిస్తారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోదీల సంకల్పంలో భాగంగా ఇస్రోతో కలిసి ఈ యాత్ర చేపట్టామని నాసా ఒక ప్రకటనలో వెల్లడించింది.

**'దేశ ప్రజలారా.. నమస్కారం'**

అంతరిక్షంలో పయనిస్తున్న శుభాంశు శుక్లా.. యాత్రానుభవాలను పంచుకున్నారు. భూకక్ష్యలోకి ప్రవేశించిన అనంతరం ఆయన తన స్పందనను తెలియజేశారు. 'నా దేశ ప్రజలారా.. నమస్కారం. 41 ఏళ్ల తర్వాత మనం అంతరిక్షానికి చేరుకున్నాం. ఇది ఒక గొప్ప ప్రయాణం. మేం ఇప్పుడు సెకనుకు 7.5 కిలోమీటర్ల వేగంతో భూమి చుట్టూ తిరుగుతున్నాం. నా భుజాలపై మూడు రంగుల జాతీయ జెండా ఉంది. అది.. నేను మీ అందరితో ఉన్నానని గుర్తు చేస్తోంది. ఇది ఐఎస్ఎస్‌కు నా ప్రయాణ ప్రారంభం మాత్రమే కాదు. భారతీయ మానవసహిత స్పేస్‌క్రాఫ్ట్ ప్రయాణం. మీరందరూ ఈ యాత్రలో భాగస్వాములు కావాలని కోరుకుంటున్నా. మనందరం కలిసి భారత మానవసహిత అంతరిక్ష యాత్రను విజయవంతం చేద్దాం' అని 39 ఏళ్ల శుభాంశు శుక్లా పిలుపునిచ్చారు. 'ఎంత అద్భుత యాత్ర (క్యా కమాల్ కీ రైడ్ థీ). ఇది నా ఒక్కడి అంతరిక్ష యాత్ర కాదు. ఇది భారత దేశం చేపట్టిన మానవ సహిత అంతరిక్ష యాత్రకు శు భారంభం. నా ఒక్కడి ఛాతీయేకాదు.. భారతీయులందరి ఛాతీలు ఈ యాత్రను చూసి ఉప్పొంగాలి. జై హింద్. జై భారత్' అంటూ హిందీలో శుక్లా సందేశం వినిపించారు.

**లఖ్‌నవూలో సంబరాలు**

శుభాంశు శుక్లా అంతరిక్ష పయనం సందర్భంగా ఆయన చదువుకున్న లఖ్‌నవూలోని సిటీ మాంటిస్సోరి పాఠశాలలో భావోద్వేగ వాతావరణం నెలకొంది. ఒకవైపు సంబరాలు, మరోవైపు ఆనంద భాష్పాలతో నిండిపోయింది. శుభాంశు తల్లిదండ్రులతోపాటు పలువురు ఈ పాఠశాలలో జరిగిన సంబరాల్లో పాల్గొన్నారు. భాంగ్రా నృత్యాలతోపాటు భారత్ మాతా కీ జై అంటూ నినదించారు.

**60 ప్రయోగాలు**

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో 14 రోజులపాటు గడపనున్న వ్యోమగాములు.. దాదాపు 60 ప్రయోగాలు చేస్తారు. ఇందులో హ్యూమన్ ఫిజియాలజీ, న్యూట్రిషన్, సీడ్ జెర్మినేషన్‌లలో మైక్రో గ్రావిటీ పరిశోధనలున్నాయి. పలు కార్యక్రమాల్లో అంతరిక్షం నుంచే శుక్లా పాల్గొంటారు. అందులో ప్రధానితో సంభాషణ ఉంది. యాత్రలో భాగంగా ఆయా దేశాల్లో స్థానికంగా లభించే ఆహారాన్నే వ్యోమగాములు తిననున్నారు.

## కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖైదు

దిల్లీ

భారత ప్రజాస్వామ్య చరిత్రలో 1975లో విధించిన ఆత్యయిక పరిస్థితి ఓ చీకటి అధ్యాయమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తి ఉల్లంఘనకు గురైన తీరును భారతీయులెవరూ విస్మరించలేరని పేర్కొన్నారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి 50ఏళ్లయిన సందర్భంగా బుధవారం ప్రధాని మోదీ సామాజిక మాధ్యమాల్లో పలు పోస్టుల ద్వారా తన అనుభవాలను, అభిప్రాయాలను వెల్లడించారు. 'ఎమర్జెన్సీతో ప్రాథమిక హక్కులను హరించారు. పత్రికా స్వేచ్ఛను తుడిచిపెట్టారు. అనేక మంది రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, సాధారణ పౌరులను జైలులో పెట్టారు. నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్నే ఖైదు చేసింది' అని మండిపడ్డారు. ఆత్యయిక పరిస్థితి విధించడాన్ని వ్యతిరేకిస్తూ పోరాడిన ప్రతి ఒక్కరికీ సెల్యూట్ చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం దిల్లీలో సమావేశమైన కేంద్ర కేబినెట్..ఆత్యయిక పరిస్థితిని వ్యతిరేకిస్తూ తీర్మానం ఆమోదించింది. అసంఖ్యాకులైన ఎమర్జెన్సీ బాధితుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు గౌరవించుకోవాలనీ నిర్ణయించింది.

**సాధువుగా...అగర్‌బత్తీల విక్రేతగా..**

దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని..ప్రధాని మోదీపై ప్రచురించిన పుస్తకాన్ని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ఆవిష్కరించారు. 'ఎమర్జెన్సీ డైరీస్–ఇయర్స్ దట్ ఫోర్జ్‌డ్ ఎ లీడర్' అనే పేరుతో ప్రచురితమైన ఈ పుస్తకంలో ఆత్యయిక పరిస్థితి సమయంలో మోదీ జీవిత ప్రయాణ విశేషాలను వివరించారు. మాజీ ప్రధాని దేవెగౌడ ముందుమాట రాశారు. ఎమర్జెన్సీ విధించే నాటికి మోదీ 25 ఏళ్ల వయసు వారని అమిత్ షా తెలిపారు. సంఘ్ ప్రచారకుడైన మోదీ.. ఇందిరాగాంధీ నియంతృత్వ పోకడలను వ్యతిరేకిస్తూ నగరాల్లో, గ్రామాల్లో ప్రచారం చేశారని వెల్లడించారు. ప్రభుత్వ నిర్బంధాన్ని తప్పించుకునేందుకు అజ్ఞాతంలో ఉంటూ, మారువేషాల్లో తిరిగారని చెప్పారు. సాధువుగా, సర్దారుగా, అగరబత్తీలు, పత్రికల విక్రేతగా ఎమర్జెన్సీ విధింపును వ్యతిరేకిస్తూ ప్రచారం చేశారని వివరించారు. అదే పట్టుదలతో 2014లో వారసత్వ రాజకీయాలను బద్దలుకొట్టారని షా తెలిపారు. ఎమర్జెన్సీలో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలను నేటితరానికి తెలియజేయడానికే భాజపా ప్రభుత్వం జూన్ 25ను 'సంవిధాన్ హత్య దివస్'గా పాటిస్తున్నట్లు వెల్లడించారు.

**వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే భాజపా డ్రామా: ఖర్గే**

ప్రధాని మోదీ, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా తదితర భాజపా నేతలు కాంగ్రెస్‌పై చేస్తోన్న విమర్శలను ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తిప్పికొట్టారు. మోదీ నేతృత్వంలో దేశంలో గత 11 ఏళ్లుగా అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందని ఆరోపించారు. తమ పాలనా వైఫల్యాలను దాచిపెట్టడానికే 'సంవిధాన్ హత్య దివాస్' పేరుతో భాజపా నేతలు డ్రామా ఆడుతున్నారని ధ్వజమెత్తారు.

# సాంకేతిక సౌరభం

వనపర్తిటౌన్

వనపర్తి ఎడ్యుకేషన్ హబ్‌కు కేరాఫ్‌గా మారింది. ఇందుకు సంస్థానాదీశుల కాలంలోనే బీజం పడింది. పాఠశాల విద్య, సాంకేతిక విద్యకు వనపర్తి రాజులు జీవం పోశా రు. 1936, అంతకంటే ముందు నిజాం ప్రభువు హయాంలో హైదరాబాద్ రాష్ట్రంలో పది పాఠశాలలు ఉంటే.. అందులో ఒకటి వనపర్తిలో (పాత జూనియర్ కళాశాల) ఏర్పాటు చేసేలా సంస్థానాదీశులు చొరవ తీసుకున్నారు. అప్పట్లో నిరుపేద కుటుంబాలకు చెందిన అన్ని వర్గాల విద్యార్థులకు ప్రతి ఏటా స్కాలర్‌షిప్‌లు అందించే వారు. 1959లో సంస్థానాదీశుడు రాజా రామేశ్వర్‌రావు హయాంలో దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చేతుల మీదుగా ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించారు. ఈ కళాశాలలో చదువుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా.. నేపాల్, జర్మనీ తదితర దేశాల నుంచి వచ్చి సాంకేతిక విద్య ను అభ్యసించారు. ఎలక్ట్రికల్, సివిల్, మెకానికల్ కోర్సుల్లో 30 నుంచి 40 మందికి సాంకేతిక విద్య అందించారు.

**రాజా రామేశ్వర్‌రావు ఔదార్యం..**

ఈ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలను రాజా రామేశ్వర్‌రావు 1959 నుంచి 1971 వరకు సమర్థవంతంగా నడిపారు. ఆ తర్వాత 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రాజప్రాసాదాన్ని (కళాశాల భవనం) ఒక్క రూపాయి ఆశించకుండా ప్రభుత్వానికి అందజేశారు. అప్పట్లో రాజా వారి నిర్ణయం సంచలనమని నేటికీ చర్చించుకుంటారు.

**ఆరు కోర్సులతో..**

పాలిటెక్నిక్ విద్య ప్రభుత్వ అదీనంలోకి వచ్చాక మొదట్లో ఉన్న మూడు కోర్సులతో పాటు సీసీపీ, డీ ఫార్మసీ, ఇన్‌స్ట్రుమెంటేషన్ కోర్సులతో కళాశాల కొనసాగుతోంది. 1,200 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా.. కృష్ణదేవరాయ పాలిటెక్నిక్ పేరుతో రాజప్రాసాదం విరాజిల్లుతోంది.

**55 ఏళ్ల తర్వాత మహిళా పాలిటెక్నిక్ కళాశాల..**

వనపర్తిలో సాంకేతిక విద్యకు అడుగులు పడిన 55 ఏళ్ల తర్వా త జిల్లాలోని పెబ్బేరుకు మహిళా పాలిటెక్నిక్ కళాశాల మంజూరైంది. ఇందులో రెండు కోర్సులు ఉన్నాయి. ప్రస్తుతం 300 మంది విద్యార్థినులు చదువుతున్నారు. రాజుల కాలంలోనే మోడల్ బేసిక్ ప్రాక్టిసింగ్ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్య అనంతరం కొన్నేళ్ల పాటు వనపర్తి పాతబజార్‌లోని హనుమాన్, శంకర్‌గంజ్‌లోని దేవాలయాల్లో బ్రాహ్మణులు నిరుపేదలకు చదువులు చెబుతూ జీవ నం సాగించేవారు. సంస్థానాధీశుల కాలం నుంచే వనపర్తిలో విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇస్తూ వస్తున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే ఇక్కడ పాఠశాల విద్యకు ప్రాధాన్యం ఉంది. ఫలితంగా ఇక్కడి ప్రజలు విద్యాపరంగా చైతన్యవంతులు అని గుర్తింపు వచ్చింది.

**ఉపాధి అవకాశాలు మెండు..**

ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ శాఖ గుర్తింపు పొందిన పాలిటెక్నిక్ విద్య విద్యార్థులకు వరంలాంటిది. పాలిటెక్నిక్ విద్యతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయి. పలు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు. ప్రైవేట్ కంపెనీల్లో రూ. 3 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు సంపాదించొచ్చు. డిప్లొమాతోనే విద్యార్థులు స్థిరపడే అవకాశం పాలిటెక్నిక్ విద్యతో చేకూరుతుంది. త్వరలో జరిగే పాలిసెట్ కౌన్సిల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. %–% జగన్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, వనపర్తి

**విద్యాపర్తిగా గుర్తింపు..**

రాజుల కాలం నుంచే విద్యకు ప్రాధాన్యం ఇచ్చారు. సాంకేతిక విద్యలో వనపర్తికి ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచే కాకుండా రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్ జిల్లాల నుంచి ఇక్కడకు వచ్చి విద్యనభ్యసించారు. జిల్లాలోని పెబ్బేరులో పదేళ్ల క్రితం మహిళా పాలిటెక్నిక్ కళాశాలతో పాటు ప్రైవేట్ రంగంలోనూ సాంకేతిక విద్య అందుబాటులోకి వచ్చింది.

**ఉన్నత స్థాయికి చేర్చింది..**

వనపర్తిలో విద్యనభ్యసించిన ఎంతోమంది అత్యున్నత స్థాయికి చేరారు. నిజాం కాలం నుంచి వచ్చిన ప్రతి విద్యాసంస్థ ప్రారంభం వెనుక ప్రజా పోరాటాలు, ప్రజల ఆకాంక్షలు ఇమిడి ఉన్నాయి. రాజరికం నుంచి ప్రస్తుత రాజకీయ పార్టీలకు అతీతంగా విద్యావికాసంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే వనపర్తి అగ్రగామిగా నిలుస్తుంది. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, సైంటిస్టులు, హైకోర్టు న్యాయమూర్తులు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి వంటి వారితో పాటు ప్రతి రంగంలో వనపర్తి అక్షర జ్ఞానం కనిపిస్తుంది. నిజాం కాలంలో ప్రతిభ కలిగిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చి ప్రోత్సహించిన చరిత్ర ఈ ప్రాంతానికి ఉంది. అంతే కాకుండా కులమతాలకు అతీతంగా అందరికీ విద్య అందించడంలో వనపర్తి ఆది నుంచీ అడుగులు వేస్తోంది.

# తీరప్రాంత పరిరక్షణలో నౌకాదళ అసమాన సేవలు

భారత నావికాదళం దేశం యొక్క సముద్ర సరిహద్దులను భద్ర పరచుటలో, ఓడరేవు సందర్శనల ద్వారా, భారతదేశం అంతర్జాతీయ సంబంధాలను విస్తరించుటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. భారతదేశ నావికా దళం భారత సైనిక దళాల యొక్క సముద్ర విభాగం. భారతదేశ రాష్ట్రపతి నౌకాదళానికి సర్వ సైన్యాధ్యక్షుడు. కేవలం దేశ రక్షణకే కాకుండా మానవతా సహాయాలకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నపుడు సహాయం కొరకు భారత ప్రభుత్వం నేవీని వినియోగిస్తుంది. ఉమ్మడి వ్యాయామాలు, మానవతావాద మిషన్లు, విపత్తు ఉపశమనం మొదలైనవి వారి కర్తవ్యాలు. భారత దేశంలో క్రీ. పూ. 2300లో ప్రస్తుత గుజరాత్ లోని మంగ్రోల్ దగ్గర మొట్టమొదటి నౌకాతీరం నిర్మించ బడినది. క్రీ.పూ. 4వ శతాబ్దంలో మౌర్య సామ్రాజ్యంలో మొదటిసారి నౌకా విభాగాన్ని ఏర్పరిచారు. చంద్రగుప్త మౌర్యుడి ప్రధాన మంత్రి అయిన చాణక్యుడు తాను రచించిన అర్ధ శాస్త్రంలో నవాధ్యక్ష పేరుతో నదీ జలాల వినియోగం గురించి నిర్దేశించాడు. బ్రిటిషు ప్రభుత్వం భారత దేశాన్ని పాలిస్తున్నప్పుడు 1830లో రాయల్ ఇండియన్ నేవిని ఏర్పరిచారు. ఇది 1946 నాటికి 78 ఓడలు, 2000 మంది నిబ్బంది కలిగి ఉండేది. 26 జనవరి 1950 న భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చిన రోజున నౌకా దళానికి ఇండియన్ నేవిగా, వాహకాలకు ఇండియన్ నావల్ షిప్ గా పేరు పెట్టారు. 1961లో జరిగిన ఆపరేషన్ విజయ్ లో ఇండియన్ నేవి మొట్ట మొదటి సారి యుద్ధంలో పాల్గొన్నది. 1965లో జరిగిన భారత్ – పాక్ యుద్ధంలో నేవి ఎక్కువ పాల్గొనక పోయిన తీర ప్రాంతాల పరిరక్షణలో కీలకపాత్ర వహించింది. 1971లో జరిగిన భారత్ – పాక్ యుద్ధంలో నేవి విశిష్టమైన పాత్ర పోషించింది. ఈ యుద్ధంలో పాకిస్తాన్ దగ్గర ఉన్న అత్యంత ప్రమాదకరమైన పి ఎన్ ఎస్ ఘాజి జలాంతర్గామిని ధ్వసం చేసి సముద్రంలో ముంచి వేసిన ఘనత ఐ ఎన్ ఎస్– రాజ్ పుత్ కు దక్కుతుంది. ఐ ఎన్ ఎస్ నిర్ఘాట్, ఐ ఎన్ ఎస్ నిపత్ లు కరాచీ పోరను చుట్టిముట్టి మిగిలిన పాకిస్తాన్ పోర్టులతో రాకపోకలను, పాక్ సైన్యానికి సహాయాన్ని అడ్డుకొని భారత దేశానికి విజయాన్ని అందించడంలో ముఖ్యపాత్ర వహించాయి. 2004లో దక్షిణ భారత దేశాన సునామి సంభవించి నపుడు కొద్ది గంటల్లోనే నేవి 27 నౌకలు, 19 హెలీకాప్టర్లు, 06 యుద్ధ విమానా నౌకలు, 5000 మంది సిబ్బందితో ముందుగా సహాయ చర్యలు చేపట్టింది. నేవి చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున సహాయ చర్యలు చేపట్టడం ఇదే ప్రథమం. ఆధునిక భారతీయ నౌకాదళం హిందూ మహాసముద్ర ప్రాంతంలో తన స్థానాన్ని




మెరుగు పరిచేందుకు వేగవంతమైన పునర్నిర్మాణంలో భాగంగా ఉంది. ఈ నివేదిక ప్రకారం 58,000 మంది సిబ్బంది, విమాన వాహక నౌక, పెద్ద రవాణా ఓడ, 15 యుద్ధ నౌకలు, 8 గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్లు, 24 కొర్వెట్టెలు, 13 సంప్రదాయ జలాంతర్గాములు, 1 అణు దాడి జలాంతర్గామి, 30 పెట్రోల్ ఓడలు, వివిధ సహాయక నౌకలు మొదలైనవి భారత నావికా దళంలో భాగం. భారత నావికా దళంలో తూర్పు కమాండ్ – విశాఖపట్నం, పశ్చిమ కమాండ్ – ముంబాయి దక్షిణ కమాండ్ – కోచి, అండమాన్ నికోబార్ నావల్ – పోర్ట్ బ్లెయిర్ అనే 4 కమాండ్ లు ఉన్నాయి. 1985 నుండి అణు జలాంత ర్గాములను నిర్మించడానికి కల్పాక్కం వద్ద ఉన్న అణు కేంద్రంతో కలసి నేవి కృషి చేస్తోంది. 1987లో భారత నౌకా దళంలో జలాంతర్గాముల విభాగాన్ని ఏర్పాటు చేశారు. జలాంత ర్గాముల నుండి టర్పీడో అను క్షిపణులను ప్రయోగిస్తారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మొట్ట మొదటి సబ్ మెరైన్ – ఐ ఎన్ ఎస్ షల్కి. 8 డిసెంబర్ 1967లో భారత నౌకా దళంలో ప్రవేశ పెట్టబడిన తొలి జలాంతర్గామి – ఐ ఎన్ ఎస్ కల్వరి. జలయుద్ధం చేయాల్సి వచ్చినప్పుడు, భారత నావికా దళానికి ఎంతగానో ఉ పకరిస్తుందని భావిస్తున్న ఎలక్ట్రానిక్ టోర్పెడో 'వారుణాస్త్ర' స్వదేశీ పరిజ్ఞానంతో భారత్ అభివృద్ధి చేసిన జలాంతర్గామి విధ్వంసక టార్పెడో. భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థకు చెందిన నేవల్ సైన్స్ అండ్ టెక్నొలాజికల్ లేబొరేటరీ ఈ హెవీవెయిట్ టార్పెడోను అభివృద్ధి చేసింది. సముద్ర గర్భంలో... శత్రు దేశపు సబ్ మెరైన్ ధ్వంసం చేసే టార్పెడో ఇది. ఓడనుండి ప్రయోగించే రకపు వారుణాస్త్రను 2016 జూన్ 26న న భారత నౌకాదళంలో చేర్చుకున్నారు. యుద్ధ నౌక నుంచే ఈ హెవీ వెయిట్ టార్పెడోను సముద్రంలో దాగి ఉన్న శత్రు దేశపు జలాంతర్గామిపై ప్రయోగించవచ్చు. 95 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారైంది. ప్రపంచంలో జీపీఎస్ ఆధారంగా దూసుకుపోయే ఏకైక టార్పెడోగా వారుణాస్త్ర వినుతికెక్కింది. ఐ ఎన్ ఎస్ కల్వరి – 14 డిసెంబర్ 2017న, ఖండేరి సెప్టెంబర్ 2019న, కరంజ్ మార్చి 2021న, వేలా నవంబర్ 2021న, వాగిర్– నవంబర్ 2020లో ప్రారంభించ బడింది. 2023 జనవరి 23న వగీర్ జల ప్రవేశం చేయడంతో, భారత నౌకాదళంలో చేరి, భారతదేశం జలాంతర్గామి నిర్మాణ దేశంగా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. వగీర్ అంటే ఇసుక సొరచేప. ఐఎన్ఎస్ వగీర్లో ప్రపంచంలోని అత్యుత్తమ సెన్సార్లు ఉన్నాయి.

# చల్లదనంతో కూడిన చైతన్యం

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం జూన్ 26న ప్రపంచ శీతలీకరణ దినోత్సవంగా నిర్వహించ బడుతోంది. శీతలీకరణ, వాయు సమ శీతలీకరణ, తాప ఉత్పాదక పరికరాల తయారీ, నిర్వహణ వంటి రంగాల్లో పనిచేస్తున్న నిపుణుల సేవలను గుర్తించేందుకు, శీతలీకరణ రంగం ఆధునిక జీవితంలో కలిగించే ప్రాధాన్యతను ప్రజలకు తెలియ జేయాలనే లక్ష్యంతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవాన్ని శీతలీకరణ శాస్త్రానికి పునాదులు వేసిన శాస్త్రవేత్త లార్డ్ కెల్విన్ జన్మదినాన (జూన్ 26, 1824) నిర్వహించడం ప్రత్యేకత. నేటి జీవన విధానంలో శీతలీకరణ వ్యవస్థలు ఒక అవసరంగా మారాయి. ఇది కేవలం నివాస గదులను శీతలంగా ఉంచడానికే కాదు, ఆహార పదార్థాల నిల్వ, ఔషధ భద్రత, పారిశ్రామిక అవసరాలు, ఆసుపత్రుల నందు రోగ నిర్ధారణ పరికరాల సంరక్షణ, లబోరేటరీలలో నిగ్రహిత ఉష్ణోగ్రతల అవసరం వంటి అనేక రంగాల్లో కీలకంగా మారింది. ఆహార భద్రత విషయంలో శీతలీకరణ వ్యవస్థలు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. పండ్లు, కూరగాయలు, మాంసాహార పదార్థాలు, పాల ఉత్పత్తులు మొదలైనవి రైతు నుంచి వినియోగ దారుడికి చేరే వరకు తాజాగా ఉండేలా శీతలీకరణ పరికరాలు కాపాడు తున్నాయి. ఇలా ఉండకపోతే అవి త్వరగా పాడైపోతూ, ఆహార వ్యర్థం పెరిగేది. దీనివల్ల ప్రపంచ వ్యాప్తంగా ఆహార భద్రతకు హానికరం కలిగేది. ఔషధ రంగంలోనూ శీతలీకరణ అవసరం మరింత కీలకం. వ్యాధి నిరోధక టీకాలు, సంజీవన మందులు, రక్త నిల్వలు తదితర ఔషధ పదార్థాలను నిర్దిష్ట తాపన స్థితిలో ఉంచకపోతే అవి నిష్ప్రభంగా మారుతాయి. ఇది ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, రూరల్ ఆరోగ్య కేంద్రాల్లో శీతలీకరణ వ్యవస్థల అభివృద్ధి ఎంతో అవసరం. వాతావరణ మార్పుల నేపథ్యంలో వేడిమి తీవ్రమవుతున్న ఈ కాలంలో వాయు సమశీతలీకరణ పరికరాలు ప్రజలకు ఉపశమనం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో బాధపడేవారికి ఈ పరికరాలు హీట్ స్ట్రోక్, వాపు వంటి సమస్యల నుంచి రక్షణగా నిలుస్తున్నాయి. పరిశ్రమల విషయానికొస్తే, శీతలీకరణ వ్యవస్థలు ఆవశ్యకతగా మారినవే. రసాయన తయారీ కేంద్రాలు, విద్యుదుత్పత్తి గిడ్డంగులు, గణాంక సమాచార నిల్వ కేంద్రములు, వనరుల నిల్వ కేంద్రాలలో తాపన నియంత్రణ శక్తి లేకపోతే ఉత్పత్తి నాణ్యత తగ్గిపోతుంది. దాంతోపాటు ఉద్యోగుల ఆరోగ్యం, పనితీరు కూడా దెబ్బతింటుంది. ఈ సంవత్సరం ప్రపంచ శీతలీకరణ దినోత్సవం 'ప్రతి ఒక్కరికీ సుస్థిర శీతలీకరణ' అనే అంశంపై దృష్టిపెడుతోంది. అంటే సమాజంలోని అన్ని వర్గాలకూ శీతలీకరణ సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చేయాలన్న లక్ష్యం. ఇది నేడు అత్యంత అవసరమైన విషయముగా మారింది. ఎందుకంటే అధిక ఉష్ణోగ్రతల వల్ల కేవలం అసౌకర్యమే కాదు, అనేక అనారోగ్య సమస్యలు, మానవజాతికి ముప్పు వాటిల్లే ప్రమాదం కూడా ఉంది. ఇప్పటివరకు వినియోగించిన శీతలీకరణ పరికరాల్లో ఉపయోగించిన కొన్ని వాయువులు వాతావరణానికి హానికరంగా మారాయి. అవి ఓజోన్ పొరను భంగపరిచే విధంగా పనిచేయడం గ్రీన్ హౌస్ ప్రభావాన్ని తీవ్రతరం చేసింది. దీనిని అరికట్టేందుకు అంతర్జాతీయ ఒప్పందాలుగా మాంట్రియాల్ ఒప్పందం, కిగాలి సవరణ వంటి చర్యలు అమలులోకి వచ్చాయి. ఇప్పుడు పర్యావరణ హిత శీతలీకరణ పద్ధతులను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే విషయాన్ని ఈ దినోత్సవం గుర్తుచేస్తోంది. కొత్త ఆవిష్కరణల ద్వారా శీతలీకరణ రంగంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సూర్యశక్తితో పనిచేసే శీతలీకరణ పరికరాలు, తక్కువ విద్యుత్తుతో ఎక్కువ తాపనను తొలగించే పద్ధతులు, నిర్మాణ శైలిలోనే చల్లదనాన్ని పొందే వాస్తు రూపకల్పన వంటి మార్గాలు పర్యావరణానికి మేలు చేసే దిశగా ఉన్నత సాధనాలు. శీతలీకరణ రంగంలో పనిచేసే శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు సమాజానికి ఎంతో మేలు చేస్తున్నారు. వారి సేవలను గుర్తించడంతో పాటు, యువతను ఈ రంగంలోకి ఆకర్షించి శిక్షణనిచ్చే బాధ్యత ఈ దినోత్సవం మోస్తోంది. ప్రపంచ శీతలీకరణ దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ సరైన మార్గదర్శకత్వం అవసరం. శీతలీకరణ పరికరాలు పర్యావరణ హితంగా ఉండేలా చూసుకోవాలి. అవసరమైనంత మాత్రాన మాత్రమే వినియోగించాలి. పరికరాల్లో గాలి లీకేజీలు లేకుండా చూసుకోవాలి. విద్యుత్తు వినియోగం తక్కువగా ఉండే పరికరాలను ఎంచుకోవాలి. పునః చక్రణ యోగ్య పదార్థాలతో తయారైన పరికరాలను ప్రోత్సహించాలి. ఈ దినోత్సవం ద్వారా శీతలీకరణ కేవలం సౌకర్యం మాత్రమే కాక, భద్రత, ఆరోగ్యం, ఆహార భద్రత, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశమని గుర్తించాలి. ఈ రంగానికి సముచిత గౌరవం, సరైన అవగాహన, మరింత సాంకేతిక పురోగతి, అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేయడమే ఈ దినోత్సవం యొక్క సారాంశం. చల్లదనంతో కూడిన సుస్థిర భవిష్యత్తు నిర్మాణానికి ఇది ఒక గొప్ప ప్రారంభం కావాలి. ఈ సందర్భంలో ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యా సంస్థలు, నిపుణులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. శీతలీకరణ రంగాన్ని పర్యావరణ అనుకూల దిశగా దారితీసేందుకు విధానాలను రూపొందించాలి. గ్రామీణ ప్రాంతాల్లోనూ శీతలీకరణ సౌకర్యాలను విస్తరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు అవసరం. ఉదాహరణకు, పల్లెప్రాంతాల వైద్య కేంద్రాల్లో టీకా నిల్వ కేంద్రాలు సమర్థవంతంగా పనిచేసేలా శీతలీకరణ వ్యవస్థలు ఏర్పాటుచేయాలి. అలాగే, విద్యా రంగంలోనూ శీతలీకరణ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రాథమికంగా బోధించాల్సిన అవసరం ఉంది. ఇది ఒక విజ్ఞాన శాస్త్ర శీఘ్రంగా అభివృద్ధి చెందుతున్న శాఖ. యువత ఈ రంగంలో శిక్షణ పొందితే, ఉద్యోగావకాశాలు మాత్రమే కాదు, సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశాలూ మెండుగా ఉంటాయి. ఈ దినోత్సవం ద్వారా ప్రజల్లో శీతలీకరణ పరికరాల వినియోగం పై బాధ్యతా భావం పెరగాలి. శక్తి వినియోగాన్ని తగ్గించే పరికరాలను ఎంపిక చేయడం, పాత పరికరాలను పర్యావరణ హితంగా విసర్జించడం వంటి మార్గాలను అవలంబించాలి. వీటితో పాటు నిర్మాణ రంగంలో తక్కువ శక్తి వినియోగించే శైలి ప్రోత్సహించాలి. ఉదాహరణకు, గాలి వాతావరణం అనుగుణంగా తాపనలో తగ్గుదల కలిగించే నిర్మాణ శిల్పాలు, ప్రాకృతిక కాంతి, గాలి ప్రవాహానికి అనుకూలంగా గదుల విన్యాసం వంటి మార్గాలను ప్రోత్సహించాలి. శీతలీకరణ రంగం పట్ల సమాజం కృతజ్ఞతతో కూడిన దృష్టిని ఏర్పరచుకోవాలి. ఈ రంగం మన ఆరోగ్యానికి, జీవన నాణ్యతకు, భవిష్యత్తు తరాల పర్యావరణానికి పునాది వంటిదిగా మారుతోంది. ప్రపంచ శీతలీకరణ దినోత్సవం ఈ విషయాలన్నింటిని మన ముందుకు తీసుకువచ్చే ప్రేరణాత్మక సందర్భం. ఈ దినోత్సవాన్ని నేడు నాటివరకు పరిమితం చేయకుండా, దీని ద్వారా వచ్చే సందేశాలను జీవనశైలిలో భాగంగా మలచుకోవాలి. సాంకేతిక పరిజ్ఞానంతో, పర్యావరణ స్పృహతో, సామాజిక బాధ్యతతో కూడిన శీతలీకరణ వ్యవస్థలు మన చుట్టూ ఉండాలంటే మనం తీసుకోవాల్సిన చొరవలు ఎన్నో ఉన్నాయి. అవి ఒక్కొక్కటిగా నెరవేరితే, చల్లదనంతో కూడిన, ఆరోగ్యవంతమైన, సుస్థిరమైన భవిష్యత్తు మనదే అవుతుంది.

# అమ్మపూజకు అనువైన మాసం ఆషాఢం

జ్యోతిష శాస్త్ర ప్రకారం ప్రతి మాసం నిర్ణయం ఆ మాసంలో పౌర్ణమి రోజున వచ్చే నక్షత్రం ఆధారంగా చేయబడుతుంది. చైత్ర పౌర్ణమి రోజున చంద్ర సంచారము చిత్తా నక్షత్రం అవుతుంది. కనుక ఆ మాసానికి చైత్ర మాసమని, విశాఖ నక్షత్రమందు సంచరించుట వల్ల వైశాఖ మాసం అని, ఇలా పన్నెండు మాసాలు పౌర్ణమిలలో చంద్రుని సంచారం ఆధారంగా పేర్లను నిర్ణయించారు. చంద్రుడు పౌర్ణమి రోజున పూర్వాషాఢ /ఉత్తరాషాఢ నక్షత్ర సమీపాన సంచరించే మాసం ఆషాఢ మాసం. దీనిని శూన్య మాసం అంటారు. వైశాఖ, జ్యేష్ట మాసాలు వివాహాలు, గృహ ప్రవేశాలు, ఉపనయనాలు వంటి శుభకార్యాలతో కళకళలాడితే అషాఢమాసం వాటన్నింటికీ విరామం ప్రకటించే మాసం. ఆషాఢ మాసము తెలుగు సంవత్సరంలో నాలుగవ నెల. ఈ నెలలో పౌర్ణమినాడు చంద్రుడు ఉత్తరాషాఢ/పూర్వాషాఢ నక్షత్రాల సమీపంలోనికి వచ్చే నెల, ఉత్తరాయణ పుణ్యకాలం పూర్తయి సూర్యుడు మిథునరాశి నుంచి కర్కాటకరాశి లోనికి ప్రవేశిస్తాడు. దాంతో దక్షిణాయనం మొదలవుతుంది. ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు విష్ణువు పాలకడలిపై యోగనిద్రలోకి వెళ్ళే సందర్భాన్ని "తొలి ఏకాదశి"గా పరిగణిస్తారు. ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున "గురు పౌర్ణమి"గా వ్యవహరిస్తారు. మహా భాగవతాన్ని రచించిన వేద వ్యాసుడు జన్మించిన రోజును "వ్యాస పౌర్ణమి" అని కూడా అంటారు. వ్యాసుడు వేదాల్ని నాలుగు భాగాలుగా విభజించిన రోజు కూడా ఇదేనంటారు. ఆషాడం నుండే దక్షిణాయనం, వర్షరుతువు ప్రారంభం అవుతాయి. సూర్యుడు కర్కాటక రాశి లోనికి ప్రవేశించడంతో ప్రారంభమయ్యే దక్షిణాయనం, తిరిగి మకర రాశి గతుడు కావడం వరకు, ఆరు మాసాలు ఉంటుంది. సూర్యుడు భూమధ్య రేఖకు దక్షిణంగా సంచరిస్తారు. దక్షిణాయనం ప్రీతికరం. ఉత్తరాయణం కన్నా దక్షిణాయణం లోనే పండుగలు, పబ్బాలు అధికం. ఆషాడంలో ప్రధానంగా, శుక్ల పక్ష విదియ నాడు జగన్నాథ, బలభద్ర, సుభద్ర, రథయాత్రలో నిర్వహిస్తారు. "ఆషాఢ శుద్ధ పంచమ్యాం, వచ్చెనే వృద్ధ గౌతమి... అథవా తప్పి దారేణా, ద్వాదశ్యామది తప్పదు". అని లోకోక్తి ఉంది. గోదావరి తీర వాసుల్లో పంచమి తప్పితే ద్వాదశి గోదావరి వరద రాగలరని భావన, స్కంద పంచమి నాడు సుబ్రమణ్య స్వామిని ఆరాధించే దినంగా "కుమార షష్ఠి"గా, "భాను సప్తమి" పర్వదినాలను ఆచరిస్తారు. దశమి నాడు మహాలక్ష్మి ఆరాధిస్తారు. ప్రధానంగా శుక్ల ఏకాదశి "తొలి ఏకాదశి" అంటారు. "మహా ఏకాదశి"గా "ప్రథమైకాదశి" గా "శయన ఏకాదశి" గా పిలువబడే ఈ దినం నాడు చాతుర్మాస దీక్షలు ప్రారంభిస్తారు. ఉత్తరాయణంలో పండగలు పబ్బాలు అధికం. అయితే



దక్షిణాయనంలో ఆరోగ్య పరిరక్షణార్థం, నియమాలు ఎక్కువగా పాటించాల్సిన సమయంలో, పూర్వీకులైన పెద్దలు, వ్రతాలు ఉత్సవాలు ఎక్కువ పెట్టారు. వాటికి బోణీ వంటిది తొలి ఏకాదశి. త్రైమూర్త్య స్వరూపుడైన గురువును పూజించే దినం "గురు పూర్ణిమ" లేదా "వ్యాస పూర్ణిమ". తెలంగాణలో ఆషాడంలో "బోనాల పండుగ" జరుపు కోవడం, అనాది నుండి వస్తున్నది. భోజనానికి వికృతి అయిన బోనాన్ని అమ్మవారికి నివేదించడం గ్రామీణ ఆచారం. హైదరాబాదు, సికింద్రాబాదు, తెలంగాణ, రాయలసీమలోని కొన్ని ప్రాంతాలలో ఆషాఢ మాసంలో బోనాలు పండుగ జరుపుకో బడుతుంది. మార్పు వల్ల, ఆరోగ్యానికి హాని చేకూర్చే వ్యాధుల నుండి కాపాడే, అన్నం, బెల్లం, పెరుగు, పసుపు నీళ్ళు, వేపాకులు, బోనాల్లో చేరుస్తారు. రైతులు వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యే కాలమిది. గ్రామీణులు వ్యవసాయ పనులకు వెళుతూ, తీరిక లేకుండా పని చేయాల్సి ఉన్నందున, విత్తడానికి అనువైన కాలం అయినందున, వైవాహిక జీవితం ధ్యాస నుండి మళ్ళించేందుకు, అత్తవారింటికి అల్లుడు వెళ్లకూడదనే నియమం పెట్టారు. పూర్వకాలంలో వ్యవసాయమే జీవనాధారం. సంపాదన మాట అటు నుంచి తినడానికైనా కొన్ని గింజలు ఉండాలని, కొత్త వలపు మోజులో పడి జీవనాధారమైన వ్యవసాయాన్ని ఎక్కడ నిర్లక్ష్యం చేస్తారో. అనీ ఈ నిబంధన పెట్టారు. అంతే కాదు ఈ మాసంలోని వాతావరణంలో చాలా మార్పులు చోటు చేసుకుటాయి. చల్లని వాతావరణం వల్ల బ్యాక్టీరియా, వైరస్లు అంటువ్యాధులుగా బాగా ప్రబలుతాయి. ఇలాంటి సమయంలో కొత్త పెళ్ళి కూతురు గర్భం దాల్చితే, పుట్టబోయే బిడ్డమీద వాటి ప్రభావం ఉంటుందనేది శాస్త్రీయ నమ్మకం. పిండానికి తొలి మూడు నెలలు చాలా ముఖ్యం. ఆ సమయంలోనే అవయవాలు ఏర్పడతాయి. జన్మించిన సమయం కన్నా, గర్భధారణ సమయం ముఖ్యమని పూర్వకాలంలో భావించేవారు. ఆషాఢంలో గర్భం దాల్చితే తొమ్మిది నెలలకి అంటే చైత్రం పూర్తవుతుంది. ఆ సమయంలో ఎండకు పుట్టిన పిల్లలు, బాలింతలు తట్టుకోలేదని ఈ నియమం పెట్టారు. అలాగే ఒక నెల వియోగం తర్వాత కలుసుకుంటే అన్యోన్యత దాంపత్యాన్ని పొందుతారని అని కూడా అంటారు. కావున ఈ నెలలో వధువు పుట్టింట్లో ఉండడమే క్షేమమని, పెద్దలు ఆధారంగా పెట్టారు. దీన్ని అనారోగ్య మానంగా పేర్కొంటారు. అందుకే కొత్తగా వివాహం అయిన నవ వధువులు, అత్త వారిళ్ళలో కాకుండా, తల్లిగారిళ్ళలో నెల రోజులు ఉండే సంప్రదాయం, ఇంకా కొనసాగుతూనే ఉంది. ఆషాఢ మాసంలో నవదంపతులు కలవ కూడదనే ఆచారాన్ని మనదేశం లోని హైందవేతర మతస్తులు కూడా కొన్నిచోట్ల పాటిస్తుంటారు. ఈ మాసంలో పాదరక్షలు, గొడుగు, ఉప్పు, దానం చేస్తే మంచి ఫలితాలు లభిస్తాయి. స్నానం, దానం జపం సత్కర్మల ఆచరణకు ముఖ్యమైన మాసం. గృహ నిర్మాణ ఆరంభాలకు శుభ సూచకమైన మాసంగా చెప్పబడింది. ఆషాఢంలో గృహ నిర్మాణం ప్రారంభిస్తే భృత్య, రత్న, పశు ప్రాప్తి కలుగుతుందని మత్స్యపురాణం వివరిస్తున్నది. ఆషాడంలో ఒక్కసారైనా గోరింటాకు పెట్టుకోవడం, ములగ కూర తినడం, అనపపప్పు వాడకాలు, ఆచారాలు ఉన్నాయి.


# బీసీలు ఎందుకు రాజ్యాధికారంలోకి రాలేకపోతున్నారు?

దేశంలో అత్యధిక శాతం జనాభా కలిగిన బీసీలు (వెనుకబడిన తరగతులు) ఈ దేశంలో కేవలం పాలితులుగా మిగిలిపోవడానికి, రాజ్యాధికారానికి చేరుకోకపోవడానికి ప్రధాన లోపాలు సామాజిక అణచివేత,విద్య,ఉద్యోగ,ఆర్థిక రంగాలలో వెనుకబడి ఉండడం,ఈ వర్గాల్లో ఐక్యత లేమి,రాజకీయ అవగాహన లోపం,అధికారంలో సరైన ప్రాతినిధ్యం కోసం పోరాడడంలో వెనుకబాటు తదితర అంశాలు కనిపిస్తున్నాయి.అందుకే మెజార్టీ భాగం ఉన్నా మైనార్టీ ప్రజల కంటే హీనంగా శతాబ్దాల తరబడి అగ్రవర్ణ పాలకుల మోచేతి నీళ్ల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి దాపురించింది.అప్పుడపుడు బీసీల హక్కుల కోసం చప్పుడు చేయడం ఏదో ఒక చిన్న బిస్కెట్ (పదవి) ఇవ్వగానే స్వార్థ ప్రయోజనాల కోసం బీసీలను విస్మరించడం పరిపాటిగా మారింది. అందుకే బీసీలు కూడా ఎవరిని నమ్మాలో ఎవరి వెనుకల సమీకరించబడాలో తేల్చుకోలేక సతికిలపడి సైలెంట్ మోడ్ లోకి వెళ్ళడం ద్వారా వారిని రాజ్యాధికారం వైపు నడిపించగల సత్తా గలిగిన కాన్సీరాం లాంటి సరైన నాయకుడు ఇప్పటి వరకు రాలేదని చెప్పాలి.ఒకరో ఇద్దరో బీసీ ప్రజల హక్కుల కోసం గొంతెత్తినా అది పూర్తిస్థాయి
కార్యాచరణ తీసుకొని ముందుకు పోకుండా హక్కులను అడిగే వరకే పరిమితమయ్యాయి.ఈనేపథ్యంలో ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో బీసీ రాజ్యాధికార సాధనకు అడ్డంకిగా మారిని పరిస్థితులను ఒకసారి పరిశీలిద్దాం. బీసీ సామాజిక వర్గాల్లో ఐక్యత లేమి బీసీ సామాజిక వర్గంలో అనేక కులాలు,ఉపకులాలు ఉండడంతో పేరుకు మాత్రమే బీసీలు కానీ, ఒకరితో ఒకరికి పొసకదు, ఒక కులానికి మరొక కులానికి ఎలాంటి బంధుత్వం ఉండదు. అందులో కూడా ఒకరు ఎక్కువ మరొకరు తక్కువనే నిచ్చెనమెట్ల వ్యవస్త బలంగా నాటుకుపోయింది.దీనితో బీసీలమని చెప్పుకుంటూనే ఎవరి కుల ప్రయోజనాల కోసం వారు పాకులాడుతూ ఉండడంతో ఈ సామాజిక వర్గాల మధ్య ఐక్యత లోపించి,ఈ



విభేదాలు రాజకీయంగా ఒక బలమైన శక్తిగా ఏర్పడకుండా నిరోధిస్తూ ఉండడం బీసీ రాజ్యాధికార సాధనకు ప్రధాన అడ్డంకి మారింది. విద్య,ఉద్యోగ,ఆర్థిక రంగాల్లో వెనుకబాటుతనం బీసీలలో చాలా మంది విద్య, ఉద్యోగ,ఆర్థిక రంగాలలో వెనుకబడి ఉన్నారు.ఇది రాజకీయ శక్తిని సమీకరించడంలో అడ్డంకిగా మారుతుంది.ఈ సామాజిక వర్గాల నుండి ఎవరైనా వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించినా వారు తమ సామాజిక ప్రయోజనాల కంటే వారి స్వప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తారు.దీనితో ఈ సామాజిక వర్గాల నుండి విద్యా,ఉద్యోగ,ఆర్థిక రంగంలో ప్రగతి లేకుండా పోయింది. కంటికి కనిపించని సామాజిక అణచివేత దశాబ్దాలుగా బీసీలు సామాజిక,రాజకీయ రంగాలలో అగ్రవర్ణాల ఆధిపత్యం కింద కంటికి కనిపించని అణచివేతకు గురవుతున్నా మేలుకొలుపు ఉండదు.ఇదే ముఖ్యంగా బీసీల రాజకీయ ప్రగతిని అడ్డుకుంటోంది.ప్రధాన రాజకీయ పార్టీల వైఖరిని క్షుణ్ణంగా పరిశీలిస్తే ఎవ్వరికైనా అర్థమవుతుంది. అన్ని అగ్రవర్ణ రాజకీయ పార్టీలు బీసీలకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పినప్పటికీ, ఆచరణలో వారిని ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగిస్తున్నాయి. నాయకత్వ అవకాశాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి.దీని కోసం అడిగే సాహసం ఆయా పార్టీలో బీసీల పేరుతో పదవులు పొందే నాయకులు ఎప్పటికీ చేయరు.కానీ, సమయం,సందర్భం వచ్చినప్పుడు,తమ పదవికి గండం ఏర్పడినపుడు బీసీ కార్డు వాడుకొని అందులో నుండి బయటపడ్డాక మళ్ళీ ఎప్పటి పాటే పాడుతూ ఉంటారు.ఇది కూడా బీసీ వర్గాల రాజ్యాధికార సాధనకు ఆటంకంగా మారుతుంది. రాజకీయ ప్రాతినిధ్యం తక్కువ బీసీల జనాభా 50%కి పైగా ఉన్నప్పటికీ,చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం 20% కంటే తక్కువగా ఉంది.ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలకు తగిన అవకాశాలు ఇవ్వడంలో అన్ని పార్టీలు విఫలమవుతున్నాయి.అయినా మనం దానిని ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకుని బీసీల హక్కుల కోసం సమర్థవంతమైన,సంఘటిత ఉద్యమాలు చేయలేకపోవడం వల్ల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై, అగ్రవర్ణ రాజకీయ పార్టీలపై ఒత్తిడి తీసుకురాలేకపోతున్నాం. పరిష్కార మార్గాలు
బీసీలు రాజ్యాధికారానికి చేరుకోకపోవడానికి కారణమైన వివిధ అంశాలను లోతుగా అర్థం చేసుకొని,వాటిని అధిగమించి,బీసీ సామాజిక వర్గాల్లోని కుల అంతరాలను తొలగించుకొని,అందరూ సంఘటితమై,ఐక్యతతో రాజకీయ ఉద్యమాలు చేపట్టాలి.విద్య,ఆర్థిక సాధికారత,రాజకీయ చైతన్యంపై దృష్టి పెట్టడం ద్వారా రాజ్యాధికారాన్ని సాధించే అవకాశం ఉంది. ఈ దిశగా బీసీలు ప్రయాణం చేయనంత కాలం హక్కుల కోసం నిందించే గొంతుగానే
ఉండిపోతాం తప్ప శాసించే స్థితికి రావడం సాధ్యం కాదు.

## ప్రాణం తీసిన పెద్ద కూతురు.. కర్తవ్యం నెరవేర్చిన చిన్న కూతురు.






**మహబూబాబాద్, జూన్ 25( ప్రభాత సూర్య):** తన ప్రేమకు అడ్డు తగులుతోందని పెద్ద కూతురు తల్లి ప్రాణం తీస్తే, తల్లి చితికి చిన్న కూతురు తలకొరివి పెట్టి కర్తవ్యాన్ని నెరవేర్చింది. రెండు రోజుల క్రితం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీడిమెట్లలో చాకలి ఐలమ్మ మునిమనవరాలు, తెలంగాణ సాంస్కృతిక బృందం సభ్యురాలు సట్ల అంజలి(39)ని ఆమె పెద్దకూతురు తన ప్రియుడితో కలిసి అతి కిరాతకంగా చంపింది. ఆమె మృతదేహానికి అంత్యక్రియలు ఆమె పుట్టినిల్లు మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం కేంద్రంలో బుధవారం జరిగాయి. నెల రోజుల క్రితం వరకు మహబూబాబాద్ జిల్లాలోనే పనిచేసిన అంజలి.. రెండు నెలల క్రితమే మేడ్చల్‌కి బదిలీపై వెల్లింది. అక్కడ తన కూతురు చేతిలోనే హత్యకు గురైంది. చిన్న కూతురు మనస్విని తల్లి చితికి నిప్పు పెట్టి తన కర్తవ్యాన్ని నెరవేర్చింది. ఈ ఘటన చూసి ప్రతి ఒక్కరు పెద్ద బిడ్డ ప్రాణం తీస్తే.. చిన్న బిడ్డ కర్తవ్యం నెరవేర్చిందని కన్నీరు మున్నీరయ్యారు.

## మార్వాడి దుకాణాల ద్వారా స్థానికులు ఉపాధి కోల్పోతున్నారు




**సంస్థాన్ నారాయణపురం, జూన్ 25( ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లాసంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో మార్వాడీల దుకాణాలకు అనుమతులు ఇవ్వొద్దని వర్తక సంఘం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. మార్వాడి దుకాణాల ద్వారా స్థానికులు ఉపాధి కోల్పోయి కూలీలుగా మారే అవకాశం ఉందని,స్థానిక వర్తక వ్యాపారులను ప్రోత్సహించాలని మార్వాడి వ్యాపారస్తులు దుకాణాల సముదాయాన్ని ప్రారంభిచుకోవడం విరమించుకోవాలని ప్రజలు సహకరించాలని కోరారు .ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షులు మురారిశెట్టి వెంకటయ్య,కార్యదర్శి వంగరి రఘు,కార్యవర్గ సభ్యులు మొగుదాల సత్తయ్య,పాలకూర్ల యాదగిరి,చిలువేరు నరసింహ, బొమ్మగోని రమేష్,తెలంగాణ బిక్షం, చిలువేరు అంజయ్య, డాక్టర్ వెంకటేష్, చిలువేరు శంకర్,తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ బిల్లులు చెల్లించాలని మానవ హక్కుల కమిషనర్ కు వినతి

సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్



**హైదరాబాద్, జూన్ 25( ప్రభాత సూర్య ):** సర్పంచ్ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సర్పంచ్ ల సంఘం రాష్ట్ర జేఏసీ అధ్యక్షులు సుర్వి యాదయ్య అన్నారు.హైదరాబాద్ నాంపల్లి లో మానవ హక్కుల కమిషనర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పులు చేసే గ్రామాల అభివృద్ధి చేస్తే పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడం దురదృష్టకరమని మండిపడ్డారు. 18 నెలల నుండి ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని వాపోయారు. అప్పుల బాధతో రోజుకో సర్పంచ్ మరణిస్తున్న కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి కనపడుతలేదని విమర్శించారు.. ఈ కార్యక్రమంలో తెలంగాణ సర్పంచ్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, సుల్లేరు సర్పంచ్ బీరప్ప, కుమార్ పల్లి సర్పంచ్ కొర్వ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాలే పార్టీ కి ఊపిరి

-ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేయాలి

-సిపిఐ మండల కార్యదర్శి కర్నాటి భాను ప్రసాద్




**ఖమ్మం( సూర్య ప్రతినిధి )** ప్రజా ఉద్యమాలే ఊపిరిగా పోరాటాల ప్రాణంగా ప్రజలకు అండగా సిపిఐ పోరాడుతుందని సిపిఐ మండల కార్యదర్శి కర్నాటి భాను ప్రసాద్ అన్నారు. బుధవారం నేలకొండపల్లి సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం ను కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద కనకబండి సీతారాములు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు.ఓట్ల కోసం కాకుండా ప్రజా సమస్యలే ఎజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడేది సిపిఐ పార్టీ అని అన్నారు. దున్నేవాడికే భూమి కావాలని శ్రమ దోపిడి వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి తెలంగాణ రైతంగ పోరాటానికి నాయకత్వం వహించిన పార్టీ సిపిఐ అని అన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆయన కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించి పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే వాటిని అదుపు చేయకుండా పేదవారి నడ్డి విరుస్తుందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ తరపున పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సీపీఐ పార్టీ సహాయ కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు రైతు సంఘం మండల కార్యదర్శి పాల్తియ శ్రీనివాస్ రావు కార్యవర్గ సభ్యులు మల్లెబోయిన ఉపేందర్ కర్నాటి నళిని రాణి రాయల మాదవ్ రావు మాళోతు అయోధ్య పాలపాటి అశోక్ కౌన్సిల్ సభ్యులు చావా గణపతి వల్లలా కృష్ణ పొలంపల్లి నారాయణ కాశబోయిన అయోధ్య మేకల పుల్లయ్య, అనంత పుల్లయ్య యలగాల వేంకటేశ్వర్లు బాలిన కృష్ణంరాజు తమ్మిశెట్టి మమత భూక్యా రాములు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ పై ఎస్సే , డ్రాయింగ్ పోటీలు




**ప్రభాత సూర్య మర్రిగూడ** నల్గొండ జిల్లా మర్రిగూడ మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసు వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ పై వ్యాసరచన డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు ఎస్సై మునగాల కృష్ణారెడ్డి మారక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్. బాలరాజు కానిస్టేబుల్స్ సత్యనారాయణ, సైదులు, హుస్సేన్, శిరీష పాల్గొన్నారు

## హైకోర్టు తీర్పుతో స్థానిక ఎన్నికలపై స్పష్టత ముందుగా చెప్పిన జ్యోతిష పరిశోధకులు కూరెళ్ళ నరసింహాచారి



**రామన్నపేట, జూన్ 25( ప్రభాత సూర్య ):** ఏడాది కాలముగా స్థానిక ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న తరుణంలో చంద్ర నక్షత్రాలైన శ్రవణ రోహిణి కుజ నక్షత్రాలైన ధనిష్ట మృగశిర నక్షత్రాలలో చంద్రుడు సంచరిస్తున్న రోజులలో స్థానిక ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే విషయంపై స్పష్టత వస్తుందని జూన్ ఆరవ తేదీన తన స్టేటస్ లో విడియో ద్వారా జ్యోతిష పరిశోధకులు కూరెళ్ళ నరసింహాచారి ముందుగా తెలియజేశారు. స్థానిక ఎన్నికలపై హైకోర్టు తీర్పు ద్వారా స్పష్టత వచ్చింది. ఆయన చెప్పినట్టుగానే హైకోర్టు తీర్పు వెలువడైన సమయంలో కుజ నక్షత్రమైన మృగశిర నక్షత్రములో చంద్రుడు సంచరిస్తున్నాడు. నక్షత్ర నాడీ సిద్ధాంతం మినా2 పద్దతి ద్వారా జ్యోతిష్య అధ్యయనం చేస్తున్న కూరెళ్ళ నరసింహాచారి తన గురువు ప్రొఫెసర్ డా.ఎన్ వి ఆర్ ఏ రాజా ప్రతిపాదించిన అద్భుత ప్రశ్న లగ్నం"డా.రాజా నక్షత్ర ప్రశ్నా లగ్నం" ద్వారా గతంలో మునుగోడు ఉపఎన్నిక షెడ్యూల్, తెలంగాణ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్, తెలంగాణ సార్వత్రిక ఎన్నికలలో 40 నియోజకవర్గాలలో అభ్యర్థుల గెలుపు ఓటములు ఫిబ్రవరిలో జరిగిన వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితం వంటివి 2019 -20 సంవత్సరములలో జరిగిన స్థానిక ఎన్నికలలో అభ్యర్థుల గెలుపు ఓటములు ఛాంపియన్ ట్రోఫీ క్రికెట్ ఫైనల్ మ్యాచ్లో భారత్ గెలుపు ముందుగా తెలియజేసి రుజువు చేశారు. తనను సంప్రదించిన వారికి జ్యోతిష్య పరిశోధన ద్వారా ఫలితాలను తెలియజేసి తమ ప్రాంతంలో జ్యోతిష నిపుణులు, పరిశోధకులుగా అందరి చేత మన్ననలు అందుకుంటున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా వెల్లంకి గ్రామానికి చెందిన కూరెళ్ల నరసింహాచారి చౌటుప్పల్ పట్టణంలో ని ఉంటున్నారు. జరగబోయే స్థానిక ఎన్నికలలో తనను సంప్రదించి విజయవకాశాలను తెలియజేయడమే కాకుండా ముఖాముఖి పోటీలోఉన్న అభ్యర్థులకు "సక్సెస్ టైం" ద్వారా విజయము పొందవచ్చని ఆయన తెలియజేశారు. నక్షత్ర నాడీ సిద్ధాంతం మీనా2 జ్యోతిష్య పద్దతిలో విస్తృతమైన పరిశోధనలు కొనసాగిస్తున్న కూరెళ్ళ నరసింహాచారి ప్రొఫెసర్ ఎన్ వి ఆర్ ఏ రాజా ఆధ్వర్యంలో నడుస్తున్న జేకేఆర్ ఆస్ట్రో రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా జ్యోతిష్య శిరోమణి విశారద ప్రవీణ వంటి అవార్డు సర్టిఫికెట్లు అందుకున్నారు. జేకేఆర్ ఆస్ట్రో రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా ఉచితముగా బోధిస్తున్న నక్షత్ర నాడి సిద్ధాంతం మినా2 పద్దతి అధ్యయనం తనను ఒక జ్యోతిష్య పరిశోధకునిగా నిలబెట్టింది అని ఆయన తె చేశారు.

## సిపిఐ పార్టీ మండల మహాసభకు టిఆర్ఎస్ జిల్లా నాయకులు, శివరాత్రి కవితవిద్యాసాగర్ రూ.10 వేల విరాళం



**సంస్థాన్ నారాయణపురం, జూన్ 25( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఈనెల 27న నిర్వహిస్తున్న సిపిఐ పార్టీ 15 మండల సభకు బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు గుడిమల్కాపురం మాజీ ఎంపీటీసీ శివరాత్రి కవిత విద్యాసాగర్ రూ.10 వేల రూపాయల విరాళాన్ని సిపిఐ పార్టీ నాయకులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు లారీ బిక్షం, నాయకులు కురుమిద్దె శ్రీనివాస్, పల్లె మల్లారెడ్డి, రాసాల వెంకటేష్, బొడ్డుపల్లి గాలయ్య, జక్కడి యాది రెడ్డి, శ్రీరామ్, వీరమల్ల యాదయ్య, మన్నే శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

## దేవాలయాలలో ఆధ్యాత్మికేతర కార్యక్రమాలు

**-ఉన్నత అధికారుల ఆగ్రహం**

**ఖమ్మం ( సూర్య ప్రతినిధి )** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం లోని ఓ దేవాలయంలో ఆధ్యాత్మికేతర కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో ఎండోమెంట్ అధికారులు సీరియస్ అయ్యారని సమాచారం. దేవాలయాల్లో ఆదాయం పెరిగేందుకు ఎండోమెంట్ అధికారులు కృషి చేయకుండా స్వలాభం కోసం పనిచేస్తున్నారని భక్తులు సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.

## రాజేంద్రనగర్ డివిజన్ నాయి బ్రాహ్మణ నూతన కమిటీ అధ్యక్షునిగా రాఘవేందర్ నాయి



**గండిపేట్, : సూర్య ప్రతినిధి** రాజేంద్రనగర్ డివిజన్ నాయి బ్రాహ్మణ నూతన కమిటీ నాయి బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని రాజేంద్రనగర్ డివిజన్ నూతన అధ్యక్షులు రాఘవేందర్ నాయి అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ నాయి బ్రాహ్మ నూతన కమిటీని బుధవారం ఏర్పాటు చేశారు. హైదర్గూడా ఏనుగుల మైసమ్మ టెంపుల్ రాజేంద్రనగర్ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ఏర్పాటుకు రాజేంద్రనగర్ దుకాణం యజమానులు నాయి బ్రాహ్మణ రాష్ట్ర ప్రెసిడెంట్ పాలవ్య శ్రీనివాస్ తో పాటు వివిధ నాయకులు పాల్గొన్నారు. రాజేంద్రనగర్ ప్రెసిడెంట్ రాఘవేందర్ నాయి ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. దీంతోపాటు నాయి యూత్ ప్రెసిడెంట్ గోపాల్ నవీన్ ను ఎన్నుకున్నారు. కమిటీలో ప్రధాన కార్యదర్శి వెంకటేష్ నాయి, కోశాధికారి మహేష్ నాయి, సలహాదారులు వెంకట్ నాయి, ఉదయ్ కుమార్ నాయి, సీనియర్ రాజన్న నాయి, రమేష్ నాయి, జాంగిర్ నాయి, సురేష్ నాయిలతో పాటు దాదాపు వందమంది పైగా మీటింగ్ కు వచ్చిన నాయిబ్రహ్మ కమిటీని ఎన్నుకున్నారు. వీరంతా కూడా ఏకమై నాయి బ్రాహ్మ సంబంధించిన వివిధ కార్యక్రమంలో ముందుండి నడిపిస్తామని కొత్తగా ఎన్నుకున్న ప్రెసిడెంట్ తెలిపారు.

## 18 వార్డులో అభివృద్ధి పనులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు గోకరి సురేష్ గౌడ్





**గండిపేట్,: సూర్య ప్రతినిధి** బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పరిశీలించడం జరుగుతుందని కాంగ్రెస్ నాయకులు గోకరి సురేష్ గౌడ్ అన్నారు. బుధవారం వార్డు పరిధిలోని అరుణోదయ కాలనీలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను గోకరి సురేష్ గౌడ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా ఎలాంటి సమస్యలు ఎదురైన వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో మొక్కలు నాటిన రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు రాజగోపాల్ గౌడ్ తోకల శ్రీనివాస్ రెడ్డిలు






**గండిపేట్, : సూర్యా ప్రతినిధి** రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని ప్రేమావతి పేట్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ 1 అధ్యక్షుడు గోద పాండు యాదవ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజభూపాల్ గౌడ్, రాజేంద్రనగర్ నగర్ నియోజకవర్గం ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అన్నారు. వాటిని సంరక్షించడంపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ పొన్నేమోని మల్లేష్ యాదవ్, జిల్లా సీనియర్ నాయకులు శ్రీధర్, కొమురయ్య, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నార గూడెం మల్లారెడ్డి, అడికే రాజు, వెంకటరమణ గుప్తా, సంతోష్ గౌడ్, జోగి రవి, బొమ్మ రాజు, నర్సింహా,విజయ్ కుమార్, సురేష్ ముదిరాజ్, సుధాకర్, నరోత్తం రెడ్డి, రఘు ముదిరాజ్, భవాని దాస్, ఎడ్లకాడి రవి, రామారావు, కిరణ్, యాదగిరి, వినయ్, నర్సింహా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్, మైలార్ దేవ్‌పల్లి డివిజన్ల బీఆర్ఎస్వీ అధ్యక్షుల నియామకం



**గండిపేట్, : సూర్యా ప్రతినిధి** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో టిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయడం జరుగుతుందని బిఆర్ఎస్ విద్యార్థి విభాగం రాజేంద్రనగర్ డివిజన్ నూతన అధ్యక్షుడు నిష్కల్ రెడ్డి, మైలార్దేవపల్లి డివిజన్ నూతన అధ్యక్షుడు వి మధుసూదన్ చారిలు అన్నారు. బుధవారం రాజేంద్రనగర్, మైలార్ దేవ్ పల్లి డివిజన్ ల బీఆర్ఎస్వీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను నియమించారు. ఈ సందర్భంగా వారికి నియోజకవర్గ అధ్యక్షుడు గౌతమ్ కట్టెల మండి నియామక పత్రాన్ని అందజేశారు. రాజేంద్రనగర్ ప్రధాన కార్యదర్శిగా అకిరా నందన్, మైలారదేవ్ పల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శిగా పి రాజులను నియమించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి బూతులు బీఆర్ఎస్ పార్టీ బలోపేతమే ఏజెండాగా పనిచేయడం జరుగుతుందని అన్నారు ఎవరికి ఎలాంటి సమస్యలు తలెత్తిన తన దృష్టికి తేవాలని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. పార్టీ అధిష్టానం తమని గుర్తించి బాధ్యతలు అప్పగించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు ఈ మేరకు అధినాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

## మూడు వేల కార్ల లోడుతో మహా సముద్రంలో మునిగిన ఆ కార్గో నౌక

న్యూ డిల్లీ : మూడు వేల కార్ల లోడుతో మెక్సికో కు వెళ్తూ అగ్నిప్రమాదానికి గురైన ఆ కార్గో నౌక ఉత్తర పసిఫిక్ మహా సముద్రంలో మునిగిపోయింది. కొన్ని వారాల క్రితం ఆ నౌకలో మంటలు చెలరేగాయి. అప్పటి నుంచి క్రమంగా మునుగుతూ ఆ నౌక ఇప్పుడు పూర్తిగా మునిగిపోయింది. నౌకలో మొత్తం 3 వేల కార్లు ఉండగా, వాటిలో 800 ఎలక్ట్రిక్ కార్లు ఉన్నాయి.అలస్కాలోని అలూటియన్ దీవుల వద్ద ఈ నౌక మునిగిపోయిందని లండన్‌కు చెందిన ఓడ నిర్వహణ సంస్థ జోడియాక్ మారిటైమ్ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే ఈ ఘటన తర్వాత అంత పెద్దగా కాలుష్యం వెలువడలేదని యూఎస్ కోస్ట్‌గార్డ్ ప్రతినిధి వెల్లడించారు. కాలుష్య నియంత్రణ పరికరాలు కలిగిన రెండు సాల్వేజ్ టగ్‌లను అక్కడ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.జూన్ 3న రవాణా నౌకలో అగ్నిప్రమాదం జరిగిందని తమకు సమాచారం వచ్చిందని యూఎస్ కోస్ట్ గార్డ్ ప్రతినిధి తెలిపారు. ప్రమాద సమయంలో నౌకలో 22 మంది సిబ్బంది ఉండగా వారందరూ లైఫ్‌బోట్‌ల ద్వారా బయటపడ్డారని వివరించారు.

## భారత అంతరిక్ష చరిత్రలో కొత్త మైలురాయి..

**న్యూ డిల్లీ :** భారతదేశానికి చెందిన వ్యోమగామి శుభాంశు శుక్లా యాక్సియం-4 మిషన్‌లో భాగంగా బుధవారం రోదసిలోకి వెళ్లారు. దాంతో దాదాపు 41 ఏళ్ల తర్వాత అంతరిక్షంలో అడుగుపెట్టిన తొలి భారత వ్యోమగామిగా ఆయన చరిత్రలో సృష్టించారు. ఈ మిషన్‌కు శుక్లా గ్రూప్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రయోగం సక్సెస్‌పై తాజాగా రాష్ట్రపతి ద్రౌపది ముర్మ స్పందించారు.ఫాల్కన్ 9 రాకెట్‌లో భారత్ నుంచి గ్రూప్ కెప్టెన్‌గా వెళ్లిన శుభాంశు శుక్లా భారత అంతరిక్ష చరిత్రలో కొత్త మైలురాయిని నెలకొల్పారని రాష్ట్రపతి అన్నారు. వారి ప్రయాణంపై దేశం మొత్తం సంతోషంగా, గర్వంగా ఉందని వ్యాఖ్యానించారు.

## ఘనంగా వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో చండీ హోమం



**గండిపేట్, : సూర్యా ప్రతినిధి** ప్రతి అమావాస్య రోజు ప్రత్యేక పూజలతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గంధంగూడ బండ్లగూడ జాగీర్ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరాలయంలో అమావాస్య సందర్భంగా చండీ హోమం ఘనంగా జరిగింది. 13 అధ్యాయులతో వేద పండితుడి మంత్రోచ్ఛరణతో బ్రహ్మాండంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు భక్తులు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు, రేణుక ఎల్లమ్మ దేవాలయ సభ్యులు చండీ హోమంలో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి అమావాస్య రోజు చండి హోమం తదనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వివరించారు. దాదాపుగా 200 మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బీజేఎంసీలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి

**కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర**




**గండిపేట్, : సూర్యా ప్రతినిధి** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వందరోజుల ప్రణాళికతో స్థానికంగా పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర తెలిపారు. కమీషనర్ %ః% డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశముల మేరకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ లోని ప్రశాంత్ నగర్ కాలనీలో తడి చెత్త, పొడి చెత్త, హానికారక చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ కమిషనర్ మాట్లాడుతూ.. స్థానికంగా వందరోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఆదేశాలను పాటిస్తూ పారిశుధ్యని అమలు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ యాదయ్య, ఏఈఈ రాజ్ కుమార్, ఐసి ఎస్ఐ జీ వెంకట్ రెడ్డి, బిల్ కలెక్టర్లు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లపై ఆసక్తి చూపని గ్రామస్తులు

**అదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. లబ్ధిదారులను ఎంపిక చేసి ఐదు నెలలు గడిచినా, ఆర్థిక స్థోమత లేక, వర్షాకాలంలో ఎక్కడ ఉండాలనే భయంతో చాలామంది నిర్మాణాలు ప్రారంభించలేదు. ఇల్లు కట్టుకోని వారి స్థానంలో కొత్తవారిని ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు, అయితే పాత లబ్ధిదారులు ఎప్పుడైనా ముందుకొస్తే వారికి మంజూరు చేస్తామని చెప్పారు.ఇల్లు లేని నిరుపేదలకు సొంతిళ్లు నిర్మించి ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ పథకం ఆదిలాబాద్ జిల్లాలో అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులను ఎంపిక చేసి 5 నెలలు గడిచినా.. చాలా మంది నిర్మాణ పనులను ప్రారంభించలేదు. మరీ ముఖ్యంగా సొంత ఖర్చులతో ఇళ్లను నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడం, వర్షాకాలంలో ప్రస్తుతం నివాసం ఉంటున్న పాకలను తొలగిస్తే ఎక్కడ ఉండాలనే భయం వంటి కారణాలతో చాలా మంది ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది.అయితే ఇలాంటి వారికి ఐకేపీ ద్వారా రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు లోన్ ఇచ్చేందుకు కూడా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. అయినప్పటికీ ఆ రుణం తీసుకునేందుకు చాలా మంది లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం నివసిస్తున్న పాకలను తొలగిస్తే.. ఇప్పుడు వర్షాకాలంలో ఎక్కడ నివసించాలనే బెంగతో అక్కడి జనం ఆసక్తి చూపడం లేదని పలుచోట్ల అధికారుల దృష్టికి వచ్చింది. మరోవైపు గ్రామాల్లో ఇళ్లు అద్దెకు దొరకడం చాలా కష్టంగా మారిందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మొదటి విడతలో 17 మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేశారు. జనవరి 26వ తేదీన మండలానికి ఒక గ్రామం చొప్పున ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అధికారులు మంజూరు పత్రాలు అందించారు. ఇప్పటికీ లబ్ధిదారులు పనులు ప్రారంభించకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు వారితో తరచూ సంప్రదింపులు జరుపుతునే




ఉన్నారు. వారు మాత్రం రేపు, మాపు అంటూ వాయిదా వేస్తూ కాలం గడిపేస్తున్నారు.ఈ నేపథ్యంలోనే ఉన్నతాధికారుల ఆదేశంతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడానికి ఆసక్తి లేని లబ్ధిదారుల పేర్ల జాబితాను ఎంపీడీఓల నుంచి సేకరించారు. జిల్లాలోని ఏజెన్సీ పరిధిలోకి వచ్చే నార్నూర్, ఉట్నూర్, గాదిగూడ, సిరికొండ మండలాల్లో లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవటం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోంది. భోరజ్ మండలం పిప్పర్‌వాడలో 46 మంది.. మావల మండలం వాఘాపూర్‌లో 45 మంది.. తాంసి మండలం హస్నాపూర్‌లో 26 మంది ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు ఆసక్తి లేనట్లు అధికారులు గుర్తించారు.ఇక బేల మండలం డోప్టాలో 83 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా.. అందులో సగం మంది ఇంకా నిర్మాణ పనులు మొదలుపెట్టలేదు. వారిలో 30 మందికి అసలు ఇల్లు నిర్మించుకునేందుకు.. ఆసక్తి లేదని అధికారులు గుర్తించారు. బోథ్ మండలం కుచులాపూర్‌లో 232 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా.. సగానికంటే ఎక్కువ ఇళ్ల పనులు ఇంకా ప్రారంభించనే లేదు. ఇక్కడ 142 మంది వరకు ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపడం లేదని అధికారుల పరిశీలనలో వెల్లడైంది.ఇక ఈ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై జడ్పీ సీఈఓ (ఇందిరమ్మ ఇళ్ల ప్రత్యేకాధికారి) జితేందర్‌రెడ్డి స్పందించారు. ఇళ్లు నిర్మించుకోని వారికి రద్దు చేయడం అంటూ ఏమీ ఉండదని.. ఎంపీడీఓ లాగిన్‌లో వారి పేర్లు యథావిధిగా ఉంటాయని తెలిపారు. ఎప్పుడైనా ఆసక్తి ఉంటే ముందుకొస్తే జిల్లా కలెక్టర్ లాగిన్‌కు పంపించి ఇల్లు మంజూరు చేస్తామని తేల్చి చెప్పారు. ఆలోగా అదే స్థానంలో కొత్తవారిని ఎంపిక చేస్తామని వెల్లడించారు.

బిజినెస్

## రుణ డిమాండ్‌లో మందగింపు

### రిటైల్ క్రెడిట్‌లో 5 శాతం తగ్గుదల



రుణాలు జారీలో మందగింపు చోటు చేసుకుంది. ఈ ఏడాది మార్చితో ముగిసిన త్రైమాసికంలో రిటైల్ రుణాల జారీలో 5 శాతం తగ్గుదల చోటు చేసుకుందని ట్రాన్స్‌యూనియన్ సిబిల్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ముఖ్యంగా గృహ రుణాలు, క్రెడిట్ కార్డుల వ్యయాలు తగ్గాయని విశ్లేషించింది. మరోవైపు అన్‌సెక్యూర్డ్ రుణాల్లో మాత్రం 30 శాతం పెరుగుదల ఉండటం ఆందోళకరం. గడిచిన మార్చి త్రైమాసికంలో గృహ రుణాల్లో సంఖ్యా పరంగా 7 శాతం పతనం చోటు చేసుకోగా.. విలువ పరంగా 1 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. ఆస్తుల రుణాల్లోను వరుసగా 1 శాతం, 15 శాతం చొప్పున మందగిస్తుంది. విలువ పరంగా క్రెడిట్ కార్డుల వ్యయాలు ఏకంగా 32 శాతం క్షీణించాయి. ద్విచక్ర వాహన రుణాలు సంఖ్యా పరంగా 1 శాతం తగ్గగా.. విలువ పరంగా 2 శాతం పెరిగాయి. మరోవైపు వ్యక్తిగత రుణాలు విలువ పరంగా 6 శాతం పెరిగాయి. వాహన రుణాలు 1 శాతం, కన్స్యూమర్ డ్యూరెబుల్స్ రుణాలు 6 శాతం చొప్పున పెరిగాయని ట్రాన్స్‌యూనియన్ సిబిల్ వెల్లడించింది. ''ముఖ్యంగా యువ రుణ గ్రహీతలతో నెమ్మదిస్తున్న క్రెడిట్ డిమాండ్, వినియోగ రుణాల డిమాండ్‌పై ప్రతికూలను ప్రతిబింబిస్తుంది. ఇది సాధారణంగా యువ రుణగ్రహీతలకు ఉత్పత్తుల ఎంపిక. వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డుల కోసం రుణాల స్థిరీకరణ, ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న ధోరణి అయినప్పటికీ, సానుకూలంగా ఉంది. బాధ్యతాయుతమైన రుణ పద్ధతుల ద్వారా మద్దతు ఇవ్వబడిన మెరుగైన తిరిగి చెల్లింపు ప్రవర్తనను ప్రతిబింబిస్తుంది.'' అని ట్రాన్స్‌యూనియన్ సిబిల్ సీఈఓ భవేష్ జైన్ తెలిపారు.

## ఇండిగో అదిరిపోయే ఆఫర్..

### కేవలం రూ.1,499కే విమాన టికెట్



ఆసియాలోని అతిపెద్ద విమానయాన సంస్థల్లో ఒకటైన ఇండిగో మంగళవారం తన వార్షిక “మాన్‌సూన్ సేల్”ను ప్రకటించింది. దేశీయ విమాన టిక్కెట్ల ధర రూ.1,499. అంతర్జాతీయ విమాన టిక్కెట్ల ధర రూ.4,399. ఈ పరిమిత కాల అమ్మకం ఇండిగో దేశీయ, అంతర్జాతీయ విమానాలలో ప్రయాణించే ప్రయాణికులు ఎంచుకున్న వివిధ రకాల యాడ్-ఆన్‌లపై ప్రత్యేక తగ్గింపులను కూడా అందిస్తుంది. ఈ సంవత్సరం జూలై 1 - సెప్టెంబర్ 21 మధ్య ప్రయాణానికి జూన్ 24 - జూన్ 29 మధ్య చేసిన బుకింగ్‌లకు ఈ ఆఫర్ చెల్లుబాటు అవుతుంది. ఈ సేల్ ప్రారంభమయ్యే వరకు కస్టమర్లు అన్నీ కలిసిన వన్-వే దేశీయ విమానాలను రూ.1,499 నుండి ప్రారంభ ధరలతో, అంతర్జాతీయ విమానాలను రూ.4,399 నుండి ప్రారంభ ధరలతో బుక్ చేసుకోవచ్చు. అదనపు సౌకర్యం, అదనపు లెగ్‌రూమ్ కోసం ప్రయాణికులు బుకింగ్ సమయంలో ఇండిగోస్ట్రెచ్ సదుపాయాన్ని ఎంచుకోవచ్చు. ఛార్జీలు రూ.9,999 నుండి ప్రారంభమవుతాయి. ప్రయాణికులు తగ్గింపు ధరకు విమానాలను ఎంచుకోవడంతో పాటు 50 శాతం వరకు తగ్గింపుతో యాడ్-ఆన్ సేవలను కూడా పొందవచ్చు. దేశీయ విమానాలకు ప్రీ-పెయిడ్ అదనపు సామానుపై ప్రయాణికులు ఇప్పుడు 50 శాతం వరకు తగ్గింపును పొందవచ్చు. అంతర్జాతీయ విమానాలకు 15 కిలోలు, 20 కిలోలు, 30 కిలోల బ్యాగ్ అలవెన్సులపై కూడా తగ్గింపును పొందవచ్చు. ఎంపిక చేసిన దేశీయ, అంతర్జాతీయ విమానాలలో ప్రాధాన్యత చెక్-ఇన్, ఎప్పుడైనా బోర్డింగ్‌తో సహా “ఫాస్ట్ ఫార్వర్డ్” సేవపై ఇండిగో 50 శాతం వరకు తగ్గింపును కూడా అందిస్తోంది.

## ఆయుధ తయారీలో భారత్ మార్క్..

# పెరుగుతున్న తయారీ కేంద్రాలు



ఒకప్పుడు రష్యా, అమెరికా, ఫ్రాన్స్ వంటి దేశాల నుంచి రక్షణ దిగుమతులపై ఎక్కువగా ఆధారపడిన భారతదేశం ప్రస్తుతం స్వయం సమృద్ధి పొందుతున్న సైనిక శక్తిగా అభివృద్ధి చెందుతోంది. 'ఆత్మనిర్భర్ భారత్', 'మేక్ ఇన్ ఇండియా' వంటి కార్యక్రమాల వల్ల దేశంలో ఇప్పుడు దాని సొంత ట్యాంకులు, క్షిపణులు, ఫైటర్ జెట్‌లు, ఫిరంగి, జలాంతర్గాములను ఉత్పత్తి చేస్తున్నారు. రక్షణ సామర్థ్యాల్లో భారత వృద్ధిని తెలియజేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. భారతదేశంలో హైదరాబాద్, పూణే, జబల్పూర్, బెంగళూరు, నాగ్‌పూర్ మరియు కొచ్చి వంటి నగరాలు వాటి ఐటీ, పారిశ్రామిక బలానికి మాత్రమే కాకుండా ఆధునిక ఆయుధాల ఉత్పత్తికి కీలక కేంద్రాలుగా కూడా వేగంగా గుర్తింపు పొందుతున్నాయి. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ), హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ వంటి ప్రధాన రక్షణ సంస్థలు, అనేక ప్రైవేట్ సంస్థలు ఈ ప్రాంతాల్లో తయారీ కేంద్రాలను నెలకొల్పాయి. ఇటీవల బెంగళూరులోని హెచ్ఏఎల్ అభివృద్ధి చేసిన 'తేజస్' ఫైటర్ జెట్‌ను భారత వైమానిక దళంలో చేర్చారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన తేజస్, క్షిపణి లాంచర్లు, స్మార్ట్ రాడార్ వ్యవస్థలు, సూపర్‌సోనిక్ సామర్థ్యాలతో సహా అధునాతన లక్షణాలతో రూపొందించారు. భారతదేశ వైమానిక పోరాట నౌకాదళాన్ని మరింత బలోపేతం చేయడానికి హెచ్ఏఎల్ ఇప్పుడు మరింత అధునాతన వెర్షన్ 'తేజస్ మార్క్ 2'పై పని చేస్తోంది. తమిళనాడులోని అవడిలో ఉత్పత్తి చేసిన అర్జున్ ట్యాంక్, పాకిస్తాన్ ట్యాంకుల కంటే యుద్ధంలో అత్యుత్తమమైనదిని పరిగణిస్తున్నారు. అలాగే జబల్పూర్‌లోని గన్ క్యారేజ్ ఫ్యాక్టరీ 'ధనుష్' ఫిరంగిని అభివృద్ధి చేసింది. దీనిని 'స్వదేశీ బోఫోర్స్' అని పిలుస్తారు. అలాగే హైదరాబాద్‌లో డీఆర్‌డీఓ, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సంయుక్తంగా ఆకాశ్ మరియు నాగ్ క్షిపణులను ఉత్పత్తి చేస్తున్నాయి. ఆకాశ్ క్షిపణి వాయు రక్షణ కోసం రూపొందించారు. బ్రహ్మోస్ క్షిపణి ప్రారంభంలో భారత దేశం, రష్యా మధ్య జాయింట్ వెంచర్ అయినప్పటికీ ఇప్పుడు దీనిని దేశీయంగా తయారు చేస్తున్నారు. భారతదేశపు మొట్ట మొదటి స్వదేశీ విమాన వాహక నౌక, ఐఎన్ఎస్ విక్రాంత్, కొచ్చిలో నిర్మించారు. అదనంగా విశాఖపట్నంలో నిర్మించిన అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిహంత్‌ను స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తుంది. భారతదేశం సముద్రంలో సూపర్ పవర్‌గా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే చండీగఢ్, కాన్పూర్‌లోని ఆయుధ కర్మాగారాల్లో ఇప్పుడు ఐఎన్ఎస్ఏఎస్ రైఫిల్, ఏకే-203, కార్బైన్‌ల వంటి చిన్న ఆయుధాలను తయారు చేస్తున్నారు.

# దిగివస్తున్న బంగారం ధరలు!



బంగారం ధరలు ఆల్‌టైమ్ గరిష్టంలో ట్రేడ్ అవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా.. తులం పసిడి ధర లక్ష మార్కు దాటి పరుగులు పెట్టింది. ఈ క్రమంలోనే బంగారం ధర రెండు రోజుల నుంచి దిగివస్తూ కాస్త ఊరటనిస్తోంది. కాగా.. ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య యుద్ధం, అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లపై ఒత్తిడి, ముడిచమురు ధరలు పెరగడం వంటి అంశాలు పసిడి ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. అటు వెండి ధరలు కూడా గరిష్ట స్థాయిల్లోనే కొనసాగుతున్నాయి. అయితే.. బులియన్ మార్కెట్‌లో పసిడి, వెండికి ఎప్పుడూ డిమాండే ఉంటుంది.. వీటి ధరలు ఒక్కోసారి తగ్గితే.. మరికొన్ని సార్లు పెరుగుతూ వస్తుంటాయి. తాజాగా.. బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. జూన్ 25 2025 బుధవారం ఉదయం వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.99,210 ఉండగా.. 22 క్యారెట్ల ధర 90,940 లుగా ఉంది. వెండి కిలో ధర రూ.1,08,900లుగా ఉంది. బంగారం తులంపై రూ.10, వెండి కిలోపై రూ.100 మేర ధర తగ్గింది. అయితే.. ఈ ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.99,210 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.90,940 లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,18,900లుగా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,210 ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.90,940లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,18,900 లుగా ఉంది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,360, 22 క్యారెట్ల ధర రూ.91,090 లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,08,900లుగా ఉంది.ముంబైలో 24 క్యారెట్ల ధర రూ.99,210, 22 క్యారెట్ల ధర రూ.90,940 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,08,900లుగా ఉంది.చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.99,210 లు ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.90,940 లుగా ఉంది. వెండి ధర కిలో రూ.1,18,900 లుగా ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.99,210, 22 క్యారెట్ల ధర రూ.90,940 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,08,900 లుగా ఉంది.

స్పోర్ట్స్

# తొలి టెస్ట్‌లో హిట్.. రెండో టెస్ట్‌లో ఫట్



కొలొంబో వేదికగా శ్రీలంక, బంగ్లాదేశ్ మధ్య ఇవాళ (జూన్ 25) రెండో టెస్ట్ ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. బంగ్లా ఇన్నింగ్స్‌లో ఓపెనర్ షద్మాన్ ఇస్లాం (46), మొమినుల్ హక్ (21), ముష్ఫికర్ రహీం (35), లిటన్ దాస్ (34), మెహిది హసన్ మిరాజ్ (31), నయీమ్ హసన్ (25) రెండంకెల స్కోర్లు చేయగా.. అనాముల్ హక్ 0, కెప్టెన్ నజ్ముల్ హసన్ షాంటో 8 పరుగులకు ఔటయ్యారు. ఆట ముగిసే సమయానికి తైజుల్ ఇస్లాం (9), ఎబాదత్ హొసేన్ (5) క్రీజ్‌లో ఉన్నారు. బంగ్లా ఇన్నింగ్స్‌ను అశిత ఫెర్నాండో (14-2-43-2), విశ్వ ఫెర్నాండో (16-3-35-2), సోనల్ దినుష (9-3-22-2), ధనంజయ డిసిల్వ (5-0-15-1), తిరండు రత్నాయకే (16-1-63-1) దెబ్బకొట్టారు. కాగా, రెండు టెస్ట్‌లు, మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్‌ల కోసం బంగ్లాదేశ్ జట్టు శ్రీలంకలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ పర్యటనలో భాగంగా గాలే వేదికగా జరిగిన తొలి టెస్ట్ డ్రాగా ముగిసింది. ఆ మ్యాచ్‌లో ఇరు జట్లు ఆటగాళ్లు అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. ఇరు జట్ల తరఫున నాలుగు సెంచరీలు నమోదయ్యాయి. బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హసన్ షాంటో రెండు ఇన్నింగ్స్‌ల్లో (148, 125 నాటౌట్) సెంచరీలు చేశాడు. తొలి ఇన్నింగ్స్‌ల్లో బంగ్లా బ్యాటర్ ముష్ఫికర్ రహీం (163), శ్రీలంక ఓపెనర్ పథుమ్ నిస్సంక (187) సెంచరీలు చేశారు.

**తొలి టెస్ట్‌లో హిట్.. రెండో టెస్ట్‌లో ఫట్**

తొలి టెస్ట్‌లో బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ హసన్ షాంటో రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలు చేసి అదరగొట్టాడు. అయితే ఇవాళ ప్రారంభమైన రెండో టెస్ట్‌లో మాత్రం 8 పరుగులకే ఔటయ్యాడు. తొలి టెస్ట్‌లో తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ, రెండో ఇన్నింగ్స్‌లో 49 పరుగులు చేసిన ముష్ఫికర్.. రెండో టెస్ట్‌లో ఓ మోస్తరు స్కోర్ (35) చేసి ఔటయ్యాడు. తొలి టెస్ట్‌లో ట్విన్ సెంచరీలు చేసి హిట్ అయిన నజ్ముల్ హసన్.. రెండో టెస్ట్‌లో సింగిల్ డిజిట్ స్కోర్‌కే ఔటై ఫట్ అనిపించాడు.

# చెత్త రికార్డ్ సొంతం చేసుకున్న శుభ్‌మన్ గిల్!

**ఇంటర్నెట్ డెస్క్:** లీడ్స్‌లో టీమ్‌ఇండియాకు ఇంగ్లాండ్‌తో జరిగిన మొదటి మ్యాచ్ ద్వారా శుభ్‌మన్ గిల్ తన కెప్టెన్సీ ప్రయాణాన్ని ప్రారంభించాడు. ఈ మ్యాచ్‌లో బ్యాటర్‌గా రాణించినప్పటికీ.. కెప్టెన్‌గా తన టీమ్‌ను మాత్రం గెలుపు బాట పట్టించలేకపోయాడు. బుమ్రా మినహా మిగతా బౌలర్లు తేలిపోవడం, ఆఖరి ఇన్నింగ్స్‌లో బెన్ డకెట్ అద్భుత సెంచరీ (149) సాధించడంతో.. టీమ్‌ఇండియా, ఇంగ్లాండ్ చేతిలో అయిదు వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఇలా గిల్ కెప్టెన్‌గా వ్యవహరించిన తొలి మ్యాచ్‌లోనే సెంచరీ చేసినా, భారత జట్టు మాత్రం ఓటమి చవిచూడాల్సి వచ్చింది.దీంతో శుభ్‌మన్ గిల్ ఈ విషయంలో.. దిలీప్ వెంగ్‌సర్కార్ విరాట్ కోహ్లీ సరసన నిలిచాడు. 1987లో అరుణ్‌జైట్లీ స్టేడియంలో వెస్టిండీస్‌తో టీమ్‌ఇండియా ఆడిన మ్యాచ్‌కు వెంగ్‌సర్కార్ సారథిగా వ్యవహరించాడు. కెప్టెన్‌గా అతడికి అదే మొదటి మ్యాచ్. ఆ మ్యాచ్‌లో అతడు రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ (102) సాధించాడు. కానీ ఆ పోరులో టీమ్‌ఇండియా అయిదు వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఇటీవల టెస్ట్ క్రికెట్‌కు తన రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్ కోహ్లీ.. 2014 డిసెంబర్‌లో అడిలైడ్ ఓవెల్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియాకు మొదటిసారిగా కెప్టెన్సీ బాధ్యతలు నిర్వహించాడు. ఆ మ్యాచ్‌లో అతడు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు బాదాడు. కానీ టీమ్‌ఇండియా ఆసీస్ చేతిలో 48 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. తాజాగా ఈ జాబితాలో టీమ్‌ఇండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా చేరి, ఓ చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు.



## గౌతమ్ గంభీర్‌పై విమర్శల వర్షం



టీమిండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ గతేడాది టీ20 వరల్డ్‌కప్ తర్వాత (2024, జూన్) బాధ్యతలు చేపట్టాడు. రాహుల్ ద్రవిడ్ నుంచి గంభీర్ బాధ్యతలు స్వీకరించాడు. ద్రవిడ్ ఆధ్వర్యంలో భారత్ టీ20 వరల్డ్ ఛాంపియన్‌గా అవతరించింది. ద్రవిడ్ వారసుడిగా అప్పటికే కేకేఆర్‌కు ఐపీఎల్ టైటిల్ (మెంటార్) అందించిన గంభీర్ రావడంతో టీమిండియాపై అంచనాలు భారీగా పెరిగాయి. మూడు ఫార్మాట్లలో భారత్‌కు తిరుగుండదని అందరూ భావించారు. అయితే అంచనాలు తారుమారయ్యాయి. గంభీర్ ఆధ్వర్యంలో టీమిండియా టెస్ట్‌ల్లో దారుణంగా విఫలమవుతూ వస్తుంది. టీమిండియా హెడ్ కోచ్‌గా గంభీర్ రెండు వరుస విజయాలతో తన ప్రయాణాన్ని మొదలుపెట్టాడు. తొలి రెండు విజయాలు బంగ్లాదేశ్‌పై సాధించినవి కావడంతో వాటికి అంత ప్రాముఖ్యత దక్కలేదు. అయితే గంభీర్‌కు అసలు పరీక్ష మూడో టెస్ట్ నుంచి మొదలైంది. భారత్ స్వదేశంలో ఇంగ్లండ్ చేతిలో వరుసగా మూడు టెస్ట్‌ల్లో ఓడింది. ఇక్కడి నుంచే గంభీర్‌పై విమర్శలు ప్రారంభమయ్యాయి. అయితే ఆ తర్వాతి మ్యాచ్‌లో భారత్ ఆస్ట్రేలియాను ఓడించడంతో గంభీర్ విజయ ప్రస్తానం మొదలైందని అంతా అనుకున్నారు. అయితే గంభీర్ విజయ పరంపర కేవలం ఆ ఒక్క మ్యాచ్‌కే పరిమితమైంది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా జరిగిన రెండో టెస్ట్‌లో భారత్ ఆస్ట్రేలియా చేతిలో పరాజయంపాలైంది. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో మూడో టెస్ట్ డ్రా కాగా.. నాలుగు, ఐదు మ్యాచ్‌ల్లో టీమిండియా వరుసగా పరాజయాలు చవిచూసింది. తాజాగా ఇంగ్లండ్ చేతిలో ఓటమితో భారత్ గంభీర్ ఆధ్వర్యంలో హ్యాట్రిక్ పరాజయాలను మూటగట్టుకుంది. గంభీర్ టీమిండియా హెడ్ కోచ్‌గా ఉండగా.. భారత్ 11 టెస్ట్ మ్యాచ్‌ల్లో కేవలం? మూడే విజయాలు సాధించింది. ఒకటి డ్రా చేసుకొని, ఏకంగా ఏడింట పరాజయాలు ఎదుర్కొంది. వరుస వైఫల్యాల నేపథ్యంలో గంభీర్‌పై విమర్శలు ధాటి బాగా పెరిగింది. ద్రవిడ్ హయాంలో వరుస విజయాలతో దూసుకుపోయిన టీమిండియా.. గంభీర్ వచ్చాక అదఃపాతాళానికి పడిపోయిందని భారత క్రికెట్ అభిమానులే అంటున్నారు. గంభీర్ వచ్చాక టీమిండియాలో రాజకీయాలు ఎక్కువయ్యాయని, అందుకే ఈ పరాజయాలు పరంపర అని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. గంభీర్ తన తీరును మార్చుకోకపోతే టీమిండియా ఇంగ్లండ్‌లో వైట్‌వాష్ తప్పదని జోస్యం చెబుతున్నారు. గంభీర్ రాజకీయాలు మాని జట్టును గెలుపు బాట పట్టించడంపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. గంభీర్ ఇదే ధోరణిని కొనసాగిస్తే.. భారత్‌కు టెస్ట్ క్రికెట్ చరిత్రలో అతి పెద్ద పరాజయాలు పరంపర తప్పదని హెచ్చరిస్తున్నారు. 1967-68లో భారత్ వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో పరాజయాలు ఎదుర్కొంది. ఇప్పటికే హ్యాట్రిక్ పరాజయాలు ఎదుర్కొన్న భారత్.. ఇంగ్లండ్ చేతిలో వైట్ వాష్ అయితే ఆ రికార్డును సమం చేస్తుంది. ప్రస్తుతం టీమిండియా గంభీర్ ఆధ్వర్యంలో గత 9 మ్యాచ్‌ల్లో ఒకే విజయం సాధించి, మరో అపవాదును మూటగట్టుకుంది.



# చిరు-నాగ్‌తో మల్టీస్టారర్.. ఇలా మిస్ అయింది!

టాలీవుడ్ సీనియర్ హీరోలు చిరంజీవి, నాగార్జున ఎంత మంచి స్నేహితులో అందరికి తెలిసిందే. ఇరు కుటుంబాల మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. పండుగ సమయంలో లేదా ఏదైనా శుభకార్యం జరిగితే ఫ్యామిలీతో కలిసి హాజరవుతుంటారు. కెరీర్ పరంగానే కాకుండా వ్యాపార పరంగానూ ఒకరికొకరు సహాయం చేసుకుంటారు. అంతా క్లోజ్‌గా ఉండే ఈ ఇద్దరు..ఇప్పటి వరకు కలిసి నటించకపోవడం గమనార్హం. వీరిద్దరి కలయికలో ఓ సినిమా వస్తే బాగుటుందని అటు అక్కినేని ఫ్యాన్స్‌తో పాటు ఇటు మెగా అభిమానులు కూడా కోరుకుంటున్నారు. అయితే గతంలోనే వీరిద్దరు కలిసి ఓ సినిమా చేయాల్సింది. కానీ చివరి నిమిషంలో అది ఆగిపోయిందట. ప్రముఖ దర్శకుడు ఈవీవీ సత్యనారాయణ..చిరు, నాగ్‌లతో ఓ సినిమా ప్లాన్ చేశాడట. వీరిద్దరికి ఉన్న స్టార్ ఇమేజ్ దృష్ట్యా.. భారీ బడ్జెట్‌తో సినిమాను తీయాలని భావించాడట. అయితే దానికి తగ్గట్టుగా కథ సెట్ కాకపోవడంతో అది కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత కూడా పలువురు దర్శకుడు వీరిద్దరితో సినిమా చేసేందుకు ప్లాన్ చేశారు.అయితే సరైన కథ దొరకపోవడంతో చిరంజీవి, నాగార్జున ఇప్పటివరకు కలిసి నటించలేదు. ఆ మధ్య అనిల్ రావిపూడి కూడా వీరిద్దరితో కలిసి సినిమా చేస్తాడనే రూమర్ వినిపించింది. చిరంజీవితో తీయబోయే సినిమాలో నాగార్జున కూడా నటిస్తాడని వార్తలు వచ్చాయి. కానీ అదంతా ఒట్టి పుకారే అని తేలిపోయింది. సరైన కథ రావాలే కానీ కలిసి నటించడానికి తాము రెడీ అని చిరు, నాగ్ ఎప్పటి నుంచో చెబుతున్నారు. కానీ మన దర్శక-రచయితలే వారిని మెప్పించే కథలను సిద్ధం చేయడం లేదు. మరి వారిద్దరు మెచ్చే కథ ఏ దర్శకుడు తీసుకొస్తాడో..అసలు చిరు-నాగ్ కాంబినేషన్‌లో సినిమా వస్తుందో రాదో చూడాలి.

# మరో ఓటీటీలో పెళ్లి కాని ప్రసాద్



సప్తగిరి, ప్రియాంకశర్మ జంటగా నటించిన చిత్రం పెళ్లికాని ప్రసాద్. ఈ ఏడాది మార్చి 21న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ఓటీటీలో సందడి చేస్తోంది. ఈ సినిమాకు అభిలాష్‌రెడ్డి గోపిడి దర్శకత్వం వహించారు. ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద అంతగా ఆకట్టుకోలేకపోయింది. ఇప్పటికే ఓటీటీలో అందుబాటులో ఉన్న ఈ చిత్రం.. ఈ రోజు నుంచి మరో ఓటీటీకి వచ్చేసింది. తాజాగా అమెజాన్ ప్రైమ్‌లోనూ అందుబాటులోకి వచ్చింది. ఇంకెందుకు ఆలస్యం పెళ్లి కాని ప్రసాద్ సినిమాను చూసి ఓటీటీలో ఎంజాయ్ చేయండి. ఈ మూవీని కె.వై.బాబు, భానుప్రకాశ్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల సంయుక్తంగా నిర్మించారు. ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులకు వినోదం అందించనుంది.

'పెళ్లికాని ప్రసాద్' కథేంటంటే..?

ప్రసాద్(సప్తగిరి) కి 38 ఏళ్లు. మలేషియాలో మంచి ఉద్యోగం.. భారీ జీతం. అయినా ఆయనకి పెళ్లి కాదు. దానికి ఒక కారణం వాళ్ళ నాన్నే(మురళీధర్). రెండు కోట్ల కట్నం ఇచ్చే అమ్మాయినే చేసుకోవాలని కండిషన్ పెడతాడు. చివరకు ఓ సంబంధం సెట్ అయి ప్రసాద్ ఇండియాకు తిరిగి వస్తాడు. అయితే ఆ సంబంధం క్యాన్సిల్ అవుతుంది. కట్ చేస్తే... ప్రియా(ప్రియాంక శర్మ) ఎప్పటికైనా పెళ్లి చేసుకుని విదేశాల్లో సెటిల్ కావాలనుకుంటుంది. ఆమెతోపాటు అమ్మ నాన్న లను, బామ్మను కూడా విదేశాలకు తీసుకెళ్లాలనుకుంటుంది. ప్రియ ఫ్యామిలీ మొత్తం ఓ ఎన్నారై సంబంధం కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. ఈ క్రమంలోనే ప్రసాద్ గురించి తెలిసి.. ఫ్యామిలీ మొత్తం డ్రాప్ చేసి పెళ్లి చేయిస్తారు. పెళ్లి తర్వాత ప్రసాద్ ఇండియాలోనే ఉండాలనుకుంటాడు. ఈ విషయం ప్రియకి తెలిసిన తర్వాత ఏం జరిగింది? అసలు ప్రసాద్ పెళ్లి తరువాత ఇండియాలోనే ఎందుకు ఉండాలనుకున్నాడు? పెళ్లి తర్వాత ప్రసాద్‌కి ఎదురైన సమస్యలు ఏంటి? విదేశాలకు వెళ్లాలనుకున్న ప్రియ ఫ్యామిలీ కోరిక నెరవేరిందా? లేదా? అనేదే తెలియాలంటే సినిమా చూడాల్సిందే.



# కూలీకి మొదటిసారి నెగిటివిటీ వచ్చింది

సూపర్ స్టార్ రజనీకాంత్, దర్శకుడు లోకేష్ కనగరాజ్ కలయికలో రూపొందుతున్న కూలీకి ఎంత హైప్ ఉందో చెప్పనక్కర్లేదు. పూర్తి స్థాయి టీజర్ రాకముందే అంచనాలు ఎక్కడికో వెళ్లిపోయాయి. నాగార్జున, ఉపేంద్ర, అమీర్ ఖాన్ పాత్రలు ఓ రేంజ్ లో ఊరిస్తున్నాయి. అనిరుధ్ రవిచందర్ సంగీతం గురించి తెలిసిందే. ఇంత భీభత్సమైన బజ్ ఉన్న టైంలో కూలీకి మొదటిసారి నెగటివిటీ కనిపిస్తోంది. హిందీ టైటిల్ ని మజ్దూర్ గా నిర్ణయించడం ఈ ప్రతికూలతకు కారణం. ఎప్పుడో యాభై అరవై సంవత్సరాల క్రితం దిలీప్ కుమార్ లాంటి సీనియర్లు వాడుకున్న అవుట్ డేటెడ్ పేరని ఫ్యాన్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూలీలో ఉన్న పవర్ ఫుల్ సౌండింగ్ మజ్దూర్ లో లేదు. అయితే దీనికి తెరవెనుక కారణాలు ఉన్నాయట. అమితాబ్ బచ్చన్ నటించిన ఎవర్ గ్రీన్ క్లాసిక్ కూలీ 1981లో వచ్చింది. దీని షూటింగ్ లోనే బిగ్ బి తీవ్రంగా గాయపడటం, దేశవ్యాప్తంగా జనాలు పూజలు ప్రార్ధనలు చేయడం అప్పట్లో సంచలనం. దానికి తగ్గట్టే సినిమా బ్లాక్ బస్టర్ అయ్యింది. టైటిల్ హక్కులు నిర్మాత తన వద్దే అట్టిపెట్టుకున్నారని ముంబై రిపోర్ట్. తర్వాత గోవిందా కూలి నెంబర్ 1, వరుణ్ ధావన్ కూలి నెంబర్ 1 వచ్చాయి కానీ వట్టి కూలీగా హిందీలో సినిమాలు రాలేదు. తెలుగులో యాక్షన్ కింగ్ అర్జున్, రియల్ స్టార్ శ్రీహరి వేర్వేరుగా చేశారు. సో కాపీ రైట్స్ సమస్య వల్లే కూలిని మజ్దూర్ గా మార్చాల్సి వచ్చిందని ఇన్ సైడ్ టాక్. రీజన్స్ ఏమైనా పాజిటివ్ హైప్ మీద ఈ మార్పు ప్రభావం చూపించేలా ఉంది. అసలే ఆగస్ట్ 14 జూనియర్ ఎన్టీఆర్ - హృతిక్ రోషన్ వార్ 2 విడుదలవుతోంది. దాన్ని తట్టుకుని ఉత్తరాది రాష్ట్రాల్లో థియేటర్లను సంపాదించడం కూలికి పెద్ద టాస్క్. అలాంటిది ఈ టైంలో టైటిల్ ఛేంజ్ చేయడం పట్ల మూవీ లవర్స్ అసంతృప్తి ఎక్స్ వేదికగా కనిపిస్తోంది. ఇదంతా ఎలా ఉన్నా తన స్టైల్ లో కనక లోకేష్ కనగరాజ్ మెప్పిస్తే మాత్రం వసూళ్ల సునామి ఖాయం. ట్రైలర్ వచ్చాక కొంత క్లారిటీ వస్తుంది. అప్పటిదాకా ఎదురు చూడాల్సిందే.

# హార్దిక్ పాండ్యాతో రిలేషన్‌పై పెదవి విప్పిన ఈశా గుప్తా..!



క్రికెటర్ హార్దిక్ పాండ్యాతో రిలేషన్‌పై బాలీవుడ్ నటి ఈషా గుప్తా క్లారిటీ ఇచ్చింది. ఇద్దరూ ప్రేమలో ఉన్నట్లుగా వార్తలు వచ్చాయి. తాజాగా సిద్ధార్థ్ కన్నన్ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈషా గుప్తా తన వ్యక్తిగత జీవితంపై మాట్లాడుతూ స్పష్టతనిచ్చింది. కొంతకాలం ఇద్దరం మాట్లాడుకున్నామని.. కానీ, డేటింగ్ చేస్తున్నట్లు అనుకోలేదని చెప్పింది. కొద్దినెలల పాటు మధ్య మాటలు సాగాయని.. బహుశా ఇది జరుగుతుందేమో, జరగదేమో అన్న దశలో ఉండేవాళ్లమని.. మేం డేటింగ్ దశకు చేరుకోకముందే అది ముగిసిపోయిందని చెప్పారు. దాన్ని డేటింగ్ చెప్పలేమని.. ఒకట్రెండు సార్లు కలిశామని.. ముందే చెప్పినట్లుగా.. కొన్ని నెలల పాటు మాట్లాడుకున్నామని.. ఆ తర్వాత అది ఆగిపోయిందని వివరించారు. నిజంగానే వారిద్దరి మధ్య సంబంధం ఏర్పడే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు ఈశా స్పందిస్తూ.. బహుశా జరిగి ఉండేదేమోనని.. అనుకున్నంత వేగంగా విషయాలు ముందుకు సాగలేదని చెప్పారు.



# రూ.100 కోట్ల క్లబ్‌లో శేఖర్ కమ్ముల 'కుబేర'

విలక్షణ దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన కుబేర చిత్రం బాక్సాఫీస్ వద్ద పరుగులు పెడుతుంది. ఇప్పటికే రూ.80 కోట్లు వసూళ్లు రాబట్టిన ఈ చిత్రం తాజాగా రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరింది. స్టార్ హీరో ధనుష్, కింగ్ నాగార్జున, రష్మిక మందన్న ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటించగా.. ఏషియన్ అధినేత సునీల్ నారంగ్ ఈ సినిమాను నిర్మించాడు. విడుదలైన మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.80 కోట్ల మార్క్ దాటిన ఈ చిత్రం 5 రోజుల్లో రూ.100 కోట్ల మార్క్‌ను అందుకుంది. ఈ సందర్భంగా చిత్రబృందం కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సముద్ర గర్భంలో నిక్షిప్తమై ఉన్న లక్షల కోట్ల ఖరీదు చేసే ఆయిల్ నిక్షేపాలపై ప్రముఖ పారిశ్రామికవేత్త నీరజ్(జిమ్ సర్భ్) కన్ను పడుతుంది. ప్రభుత్వాన్ని కొని అయినా సరే.. ఆ అయిల్ నిక్షేపాన్ని సొంతం చేసుకోవాలని ప్రయాత్నాలు మొదలుపెడతాడు నీరజ్. ప్రభుత్వ పెద్దలను లక్ష కోట్లు ఎర వేయడంతో.. వాళ్లు నీరజ్‌కు సముద్రాన్ని రాసిస్తారు. ఆ లక్షకోట్ల నల్ల ధనం ప్రభుత్వ పెద్దలకు చేరాలంటే ముందు అది వైట్ మనీగా మారాలి. అలా మార్చగల ఒకేఒక్క వ్యక్తి సీబీఐ ఆఫీసర్ దీపక్(అక్కినేని నాగార్జున). కొందరి కుట్రల వల్ల అన్యాయంగా జైలు శిక్ష అనుభవిస్తున్న దీపక్‌ను ఈ విషయంలో సాయం కోరతాడు నీరజ్. జైలు నుంచి విడిపించడమే కాక, కావాల్సినంత డబ్బు కూడా ఇస్తామనడంతో.. స్వతహాగా నిజాయితీ పరుడైన దీపక్.. కుటుంబం కోసం నీరజ్‌తో తప్పక చేయి కలుపుతాడు. ఈ క్రమంలో జరిగిన కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో నాలుగు బినామీ ఖాతాలలో లక్ష కోట్లు బదిలీ చేయాలని ప్లాన్ చేస్తారు. దాని కోసం నలుగురు బెగ్గర్లను సెలక్ట్ చేస్తారు. వారిలో దేవ(ధనుష్) ఒకడు. మరి దీపక్ ప్లాన్ వర్కవుట్ అయిందా? అసలు ఈ కథలో దేవా పాత్ర ఏంటి? దేవాకూ, దీపక్‌కూ మధ్య సంబంధం ఏంటి? పారిశ్రామిక వేత్త నీరజ్ ప్రయత్నం సఫలమైందా? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.